

నేడు టీడీపీ-జనసేన తొలి జాబితా విడుదల

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితా శనివారం విడుదలయ్యే అవకాశం ఉంది. ఉదయం 11 గంటల తర్వాత జాబితాను టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించనున్నారు.అధికారికంగా ఇంకా అభ్యర్థులను ప్రకటించకపోవడంతో ఆశావహులతో పాటు పార్టీ కేడర్ కూడా ఒత్తిడికి గురవుతోంది. ఎన్నికలకు కొద్ది రోజులు మాత్రమే ఉండడం వల్ల అభ్యర్థుల ప్రకటనపై ఒత్తిడి పెరిగింది. తొలిజాబితాలో జిల్లా నుంచి టీడీపీ, జనసేన ఉమ్మడి జాబితాలో కొన్ని పేర్లు ఉండే అవకాశం ఉంది. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా, ఇప్పటికే టీడీపీ గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకట్రాజు, రాజమహేంద్రవరం సిటీ నుంచి ఆదిరెడ్డి వాసు, అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విషయంలో క్లారిటీగా ఉన్నట్టు సమాచారం.సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ ఇస్తామని గతంలో చంద్రబాబు ప్రకటించారు. అయితే జనసేనతో పొత్తు నేపథ్యంలో రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం సీట్లపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కొవ్వూరు, నిడదవోలు సీట్లకు అంతే డిమాండ్ ఉంది. తొలి జాబితా విడుదలతో అందరిలో టెన్షన్ మరింత పెరిగింది.



వివరాలు వెల్లడిస్తున్న డీఆర్వో నరసింహులు

రేపు 53 కేంద్రాల్లో గ్రూప్-2

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 53 కేంద్రాల్లో ఈ నెల 25న ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) నరసింహులు తెలిపారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ యాజమాన్యాలు, ముఖ్య పర్యవేక్షకులు, సమన్వయాధికారులు,పరిశీలకులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఏపీపీఎస్సీ అధికారులు కూడా హాజరయ్యారు. డీఆర్వో మాట్లాడుతూ గ్రూప్-2కి జిల్లాలో 18,501 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ఒంటిగంట వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు కచ్చితంగా ఉదయం 9 గంటలకే కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీటి సదుపాయం, నిరంతర విద్యుత్‌తోపాటు అత్యవసర మందులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు అనుమతించరని తెలిపారు. అభ్యర్థులు వారికి కేటాయించిన ప్రదేశంలో 15 నిమిషాల ముందే కూర్చోవాలన్నారు. ఉదయం 9గంటల నుంచి 10.15గంటల వరకూ హాల్‌టికెట్లు, గుర్తింపు కార్డుల పరిశీలన ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ శివనారాయణ రెడ్డి, సహాయ కార్యదర్శి కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.



తూర్పు.. రాజకీయం

రాజమహేంద్రవరం చుట్టూ రాజకీయ క్రీడ

- ఇంకనూ వీడని సీట్ల సస్పెన్స్
- పోటాపోటీగా అభ్యర్థులు
- పొత్తులతో మరింత ఆలస్యం
- పోటీపై అభ్యర్థుల్లో ఉత్కంఠ
- నేడు తొలి జాబితా విడుదల
- ఫ్యాన్‌కు ఉక్కబోత
- ఇంకనూ తేలని మూడు సీట్లు
- 4 సీట్లలో బదిలీలతో అసహనం
- టీడీపీలో పెరుగుతున్న చేరికలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తూర్పు ఎటో తీర్పు అటే.. రాజకీయ పార్టీల సెంటిమెంట్. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రాజమహేంద్రవరం సెంటిమెంట్‌గా ఉండేది. ఎన్నికల శంఖారావాలన్నీ రాజమహేంద్రవరం నుంచి ప్రారంభమయ్యేవి..ఇక్కడ సభలు సక్సెస్ అయిన పార్టీదే గెలుపు అనే నమ్మకం ఉండేది. జిల్లాల విభజన తర్వాత రాజమహేంద్రవరం కేంద్రంగా కొత్త తూర్పుగోదావరి ఏర్పడిన సంగతి తెలిసిందే. కొత్త జిల్లాల వారీ తొలిసారి సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. అయినా నాటి సెంటిమెంట్ మాత్రం మారలేదు.తూర్పుగోదావరి, ముఖ్యంగా రాజమహేంద్రవరం కేంద్రంగా నేటి రాజకీయం నడుస్తోంది.తూర్పున ఏం జరిగితే అదే రాష్ట్ర వ్యాప్తంగా అమలయ్యే పరిస్థితి ఉంది. దీనికి నిదర్శనమే టీడీపీ-జనసేన పొత్తు.. అంతే కాకుండా ప్రస్తుతం బీజేపీతో పొత్తు కుదిరినా రాజమహేంద్రవరం కీలకంగా మారవచ్చని విశ్లేషకుల అంచనా.

పొత్తు పొడించింది ఇక్కడే..

త్వరలో జరగనున్న ఎన్నికలతో రాజమహేంద్రవరానికి ఓ ప్రత్యేక సంబంధం ఉంది. తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును వైసీపీ ప్రభుత్వం తప్పుడు కేసుల్లో ఇరికించి 53 రోజుల పాటు సెంట్రల్ జైలులో పెట్టిన సంగతి తెలిసిందే. అప్పుడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ చంద్రబాబుతో ములాఖత్ అయిన తర్వాత సెంట్రల్ జైలు ఎదురుగా తెలుగుదేశం,జనసేన పొత్తును ప్రకటించారు. అది పెద్ద సంచలనం. అప్పటి వరకూ అసలు పొత్తు ఉంటుందా లేదా అనే ప్రశ్న అందరినీ తొలిచేసేది. ఆ ప్రకటన ఏపీ రాజకీయాలను చాలా ప్రభావితం చేసింది. ఇటు తెలుగుదేశం, జనసేన కేడర్‌లో ఉత్సాహం నింపింది. కానీ అధికార వైసీపీకి మాత్రం వెన్నులో వణుకుపుట్టింది. అప్పుడే రాజమహేంద్రవరం వేదికగా ఏపీ రాజకీయాలలో మార్పుకు నాంది పలికినట్టు అయింది. మహానాడు వేదికగా చంద్రబాబు నాడు సూపర్ సిక్స్ పథకాలు ప్రవేశపెట్టి రాజమహేంద్రవరం సెంటిమెంట్‌ను చాటితే దానిని కొనసాగిస్తూ పవన్ కల్యాణ్ చేసి పొత్తు ప్రకటన ఓ చరిత్ర అయింది. ఆ సెంటిమెంట్‌కు ప్రాణం పోస్తూ ఇటీవల చంద్రబాబు రా కదలిరా సభను నిర్వహించి సక్సెస్ చేశారు. ఇదిలా ఉండగా ఉభయగోదావరి జిల్లాల్లో అన్ని స్థానాలు కైవసం చేసుకునే విధంగా టీడీపీ-జనసేన ముందుకు వెళుతున్నాయి. ఈ పొత్తులో బీజేపీ కూడా కలవనుందనే ప్రచారం ఉంది. ఈ మూడు పార్టీలు కలిసి విజయకేతనం ఎగురవేస్తాయని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఈ ప్రాంతంమీద దృష్టి సారించాయి.

అధినేతల పర్యటనలు..

ఎన్నికల వేళ ఇప్పటికే టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఇటీవల రాజమహేంద్రవరం రూరల్ లోని కాతేరులో రా పిలుస్తోంది రా పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సభకు భారీ స్పందన లభించడం టీడీపీ, జనసేన వర్గాల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఇటీవల రాజమహేంద్రవరంలో ఓ రోజు ఉండి రాజమహేంద్రవరం డివిజన్‌లోని రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ముఖనేతలతో సమీక్షించారు. తెలుగుదేశం, జనసేన అధినేతలు ఇప్పటికే రాజమహేంద్రవరం నుంచి ఎన్నికల సైరన్ మోగించగా, వైసీపీ అధినేత సీఎం జగన్ మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడలేదు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మాత్రం జిల్లాలో రచ్చబండ నిర్వహించి ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపు ఇచ్చారు.బీజేపీ, వామపక్ష నేతలు ప్రచారం చేసుకుంటున్నారు.

సీటు కోసం పోటాపోటీ

తెలుగుదేశం, జనసేన పార్టీల పొత్తు వల్ల ఉమ్మడి అభ్యర్థులెవరనేది చర్చనీయాంశమైంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంట్ స్థానం ఉన్నాయి. టీడీపీ, జనసేన ఎక్కడెక్కడ పోటీ చేస్తుందనేది అధికారికంగా ప్రకటించలేదు. అయితే రాజమహేంద్రవరం సిటీ, గోపాలపురం, అనపర్తి స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను ఇప్పటికే సూచన ప్రాయంగా ఖరారు చేసింది.జనసేన అధినేత పవన్ కల్యాణ్ గతంలో రాజానగరం నుంచి జనసేన పోటీ చేస్తుందని ప్రకటించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో ఆయన రాజమహేంద్రవరం రూరల్ నుంచి జనసేన పోటీ చేస్తుందని, కందుల దుర్గేష్‌ను గెలిపించాలని కూడా ప్రకటించారు. కానీ ఇక్కడ రాజానగరం నియోజకవర్గం ప్రస్తావన తీసుకు రాలేదు. ఎందుకురాలేదనేది చంద్రబాబు, పవన్ ఉమ్మడిగా సీట్లు ప్రకటించిన తర్వాతే తెలుతుంది. రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్‌లో కూడా టీడీపీ బలంగా ఉండడం వల్ల టీడీపీనే ఇక్కడ పోటీ చేస్తుందని స్థానిక నేతలు,టికెట్ ఆశించేవారు ప్రకటిస్తున్నారు.రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే,టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్లబుచ్చయ్య చౌదరి ధీమాగా ఉన్నారు. ఇదిలా ఉండగా ఒక వైపు గోరంట్ల, మరో వైపు దుర్గేష్ ఎవరి ప్రచారం వారు చేసుకుంటున్నారు.రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ ఇంకా ధీమాతోనే ఉన్నారు. రెండు పార్టీల అధి నేతలు సీట్ల కేటాయింపు చేసి అభ్యర్థులను ఖరారు చేసే వర కూ ఇక్కడ సస్పెన్స్ వీడేలా కనిపించడం లేదు.మిగిలిన నియోజకవర్గాల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులుగా పోటీపడుతున్నవారు అంతగా లేరు. అధిష్టానం ఎలా చెబితే అలా చేసే పరిస్థితులు ఉన్నాయి. నిడదవోలులో టీడీపీ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, సీనియర్ నేత కుందుల సత్య నారాయణ పోటీ పడుతున్నారు.ఈ స్థానంలో జనసేనకు కూడా కేటాయిస్తారనే ప్రచారం కూడా ఉంది. అదే జరిగితే టీడీపీ నేత ఒకరు జనసేన కండువా కప్పుకుని టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తారనే ప్రచారం ఉంది.రాజమహే ంద్రవరం సిటీలో టీడీపీ నేత ఆది రెడ్డి వాసు, జనసేన నేత అనుశ్రీ సత్యనారాయణ ఐక్యంగా పనిచేస్తుండడం,ఇక్కడ సీటు టీడీపీకేనని చెబుతుండడం గమనార్హం.గోపాలపురం, అనపర్తిలో అభ్యర్థులు నిర్ణయమైన ట్టు చెబుతున్నారు.గోపాలపురంలో వర్గాలు ఉన్నప్పటికీ అధిష్ఠానం వాటిని సరిచేసే ప్రయత్నాలు చేస్తోంది. కొవ్వూరు టీడీపీ అభ్యర్థి ఎవరనేది పెద్ద సమస్యగా మారింది. అక్కడ మాజీ మంత్రి జవహర్ టికెట్ ఆశిస్తున్నారు.కానీ అక్కడ ఓ ముఖ్యవర్గంతో ఆయనకు విబేధాలు సమస్యగా మారాయి.

ఉమ్మడి ఎంపీ అభ్యర్థి ఎవరో?

రాజమహేంద్రవరం లోక్‌సభ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఎవరనేది చర్చనీయాంశమైంది. బీజేపీ కూడా కలిస్తే ఎక్కడ ఎవరు బరిలో దిగుతారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. రాజానగరం జనసేనకు కేటాయిస్తే, అక్కడి టిడిపి ఇన్‌చార్జి, బొడ్డు వెంకటరమణను ఎంపీగా బరిలో దింపుతారనే ప్రచా రమూ ఉంది. బీజేపీ కలిస్తే మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పోటీ చేస్తారనే ప్రచారం ఉంది. ఇలా రాజమహేంద్రవరం వేదికగా రాజకీయం నడుస్తోంది. శనివారం తొలి జాబితా విడుదలయ్యే అవకాశం ఉందని స్థానిక నాయకులు చెబుతున్నారు.

వైసీపీలో నాడు అక్కడ.. నేడు ఇక్కడ..

వైసీపీ జిల్లాలో నలుగురు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ప్రకటించింది.ఇంకా ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేల విషయంలో ఎందుకో జాప్యం చేస్తోంది. ఇప్పటికే ఖరారైన అభ్యర్థులు ప్రచారం ఆరంభించినా ఎదురీత తప్పడం లేదు. రాజమహేంద్రవరం సిటీలోనే భరత్‌కు వ్యతిరేకంగా ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి విషయం చర్చనీయాంశమవుతోంది. గతంలో వేరే ప్రాంతాల్లో గడపగడపకూ తిరిగిన అభ్యర్థులు ఇవాళ కొత్తగా మరో చోట గడపగడపకూ తిరవలసి వస్తుంది. జనం కూడా పెద్దగా రావడంలేదు. కొవ్వూరులో వైసీపీకి కృష్ణబాబు అల్లుడు, వైసీపీ ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌కృష్ణ పెద్ద. మంత్రి తానేటి వనిత గోపాలపురం మారడానికి, అక్కడ నుంచి తలారి వెంకట్రావు ఇక్కడకు రావడానికి వ్యూహం రాజీవ్ కృష్ణదే అని చెబుతుంటారు. కానీ ఇటీవల రాజీవ్ కృష్ణను నర్సాపురం పరిశీలకుడిగా పంపించే ప్రయత్నం జరిగిందనే సమాచారంతో కొవ్వూరు వైసీపీలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఓ ముఖ్యవర్గం పార్టీ కార్యకలాపాల జోలికి వెళ్లకుండా ఆగిపోయింది. తర్వాత అధిష్ఠానం దిగి వచ్చి, రాజీవ్‌కృష్ణకు నచ్చచెప్పింది. కొవ్వూరుతో పాటు రాజమహేంద్రవరం లోక్ సభ స్థానంలో కూడా ఆయన సహకారం అవసరమని చెప్పి నట్టు సమాచారం. రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి, ఎంపీ మార్గాని భరత్‌తో ఏపీఐఐసీ మాజీ చైర్మన్ క్రిషా కోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిళారెడ్డి వర్గాలు దూరంగా ఉంటున్నాయి.. ఇదిలా ఉండగా ఇటీవల వైసీపీ నాయకులు టీడీపీ వైపు చూస్తున్నారు. ఇటీవల అనపర్తి, గోకవరం మండలాల్లో టీడీ పీలో చేరికలే ఇందుకు నిదర్శనం.



ఈవీఎం గొడౌన్ వద్ద కలెక్టర్ మాధవీలత

భద్రంగా ఈవీఎంలు : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 23: రాజమహేంద్రవరంలో ఎఫ్‌సీఐ గొడౌన్స్‌లో ఈవీఎంలు భద్రంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి కే.మాధవీలత తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శుక్రవారం గొడౌన్‌ను తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకం మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా గొడౌన్ వద్ద ఉన్న సీసీ కెమెరాలు, భద్రత చర్యలను పరిశీలించామన్నారు.ఈ గొడౌన్ వద్ద పోలీసు భద్రత సిబ్బంది మూడు షిఫ్టుల విధానంలో పనిచేస్తున్నారని చెప్పారు. కలెక్టర్ వెంట ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, ఏస్‌డీసీఆర్ కృష్ణ నాయక్, డీటీ ఎం.పవన్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు నలబాటి రమేష్ (కాంగ్రెస్), వై.రాజశేఖర్ (వైసీపీ), రాయుడు గణేష్ ,సిహెచ్ శ్రీనివాసరావు (టీడీపీ), బి.రామచంద్రరావు (బీజేపీ) పాల్గొన్నారు.



వాటర్ ట్యాంక్‌ను అమ్మేసిన పంచాయతీ కార్యదర్శి

దుద్దుకూరులో వార్డు సభ్యుల నిరసన

దేవరపల్లి, ఫిబ్రవరి 23: దుద్దుకూరు గ్రామ పంచాయతీ అవకతవకలపై అధికారులు చర్యలు తీసుకోవాలని దేవరపల్లి మండలం దుద్దుకూరు పంచాయతీ వార్డు సభ్యులు కే.రవికుమార్ మరో ఆరుగురు సభ్యులు శుక్రవారం ఆందోళన చేశారు. వార్డు సభ్యులు కే.రవికుమార్, నిమ్మగడ్డ హరిప్రసాద్, ముళ్ళపూడి శ్రీనివాస్, బలుసు ఇందిర, ఆరేపల్లి అమ్మన్న, మంచిలి వెంకటలక్ష్మి, మల్లిపూడి సుబ్బారావు మాట్లాడారు. పంచాయతీకి దాతలు ఇచ్చిన వాటర్‌ట్యాంక్‌ను పంచాయతీ తీర్మానంలో పెట్టకుండా ఇష్టానుసారంగా కార్యదర్శి అమ్మేశారని ఆరోపించారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం అయ్యాయని వెంటనే స్పందించి విచారణ చేపట్టాలన్నారు. ఈ అవకతవకలపై గతంలో స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కి ఫిర్యాదు చేశామన్నారు.కొవ్వూరు డివిజనల్ ప్రత్యేకాధికారి శుక్రవారం విచారణ చేపట్టడానికి వస్తున్నారని తెలియడంతో పంచాయతీ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఉన్నా ఎవరు రాలేదన్నారు. పంచాయతీ అక్రమాలపై అధికారులు స్పందించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు వివరణ ఇస్తూ పంచాయతీలో ఎటువంటి అవకతవకలు జరగలేదని వాటర్ ట్యాంక్ ఎప్పుడో పాతదని అది పనికిరాకపోవడంతో ఆ ట్యాంకును విక్రయించి ఆ సొమ్మును పంచాయతీకి చలానా రూపంలో జమ చేశామన్నారు.



అబ్బో.. కంద దుంప..

పెరవలి, ఫిబ్రవరి 23 : ఈ కంద దుంపను చూస్తే అమ్మో ఎంత ఉందో అనక మానరు.. ఎందుకంటే ఒకటా రెండా ఏకంగా ఒకటే దుంప 10 కేజీలు ఉంది. సాధారణంగా కంద దుంప బరువు కేజీ నుంచి ఐదు కేజీలు వరకు ఉంటుంది. కానీ తీపర్రుకు చెందిన కరుటూరి నారాయణరావు పొలంలో కంద దుంప సుమారు 10 కేజీల వరకు తయారైంది. కొబ్బరిలో అంతర పంటగా కందను సాగు చేస్తున్నారు. చాలా కాలంగా కొన్ని దుంపలు తవ్వకుండా వదిలివేశారు. అయితే రెండేళ్ల తరువాత గురువారం కందను తవ్వగా పెద్ద దుంప బయటపడింది. దీనిని అందరూ ఆశ్చర్యంగా చూశారు. రెండేళ్ల పాటు వదిలివేయడంతో దుంప బాగా ఊరినట్టు రైతులు చెబుతున్నారు.

ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి స్వగ్రామంలోనే నిరసన సెగ 6



నందమూరులో పాల సేకరణ యంత్రం పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

వేగంగా పాల సేకరణ : కలెక్టర్

కొవ్వూరు, ఫిబ్రవరి 23 : అమూల్ పాల సేకరణ కేంద్రాల ద్వారా పాడి రైతుల నుంచి పాలసేకరణ ప్రక్రియ వేగవంతం చేయడం జరుగుతుందని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. కొవ్వూరు మండలం నందమూరు గ్రామంలో అంబికా గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాల సేకరణ కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ కె.మాధవీలత, వేములూరులో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. పాల సేకరణ కేంద్రాల ద్వారా దళారుల ప్రమేయం లేకుండా తగిన ధర చెల్లించడం జరుగుతుందన్నారు. ఇప్పటికి కొవ్వూరు డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 44 పాల సేకరణ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, శుక్రవారం మరో 42 కేంద్రాలు ప్రారంభించామన్నారు. ప్రస్తుత్తం 5 వేల లీటర్ల పాలను సేకరిస్తున్నామని, కొత్తగా ఏర్పాటుచేసిన 42 కేంద్రాలలో ఒక్కొక్క కేంద్రం ద్వారా రోజుకి 160 లీటర్ల పాల సేకరించాలని ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతం చిట్యాల కేంద్రంలో 5 వేల లీటర్ల పాలను శీతలీకరణ చేస్తున్నట్టు తెలిపారు. త్వరలో కాపవరం గ్రామంలో బల్క్ మిల్క్ యూనిట్ అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో మార్చి 1వ తేదీ నుంచి బూపాలపట్నం, జంబూపట్నంలలో 2 బల్క్‌మిల్క్ యూనిట్లు అందుబాటులోకి తెస్తామన్నారు. రెండు యూనిట్స్ పరిధిలోని 9 మండలాల్లో 91 కేంద్రాల ద్వారా పాల సేకరణ ప్రారంభించామన్నారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా. ఎస్‌జీటీ సత్య గోవిందు, ఎంపీడీవో కె.సుశీల,బండి పట్టాభి రామారావు పాల్గొన్నారు.



20 రోజుల కిందట ట్రాప్ కెమెరాకు చిక్కిన పెద్ద పులి

జనారణ్యంలోకి.. బెబ్బులి

అడవిని వదిలేసిన పెద్దపులి



కరగపాడు రిజర్వు ఫారెస్ట్‌లో పులి దాడిలో చనిపోయిన మేక

- మళ్లీ పెద్ద పులి సంచారం
- 20 రోజుల్లో రెండో సారి రాక
- బిక్కుబిక్కుమంటూ జనం
- మూడు మేకలు హతం
- ఒక్కరాత్రిలో 30 కి.మీ ప్రయాణం
- ప్రస్తుతం కరగపాడు ఫారెస్ట్‌కు చేరిక

గోపాలపురం, ఫిబ్రవరి 23 : పెద్ద పులులు జనారణ్యంలోకి వచ్చేస్తున్నాయి... దారి తప్పుతున్నాయో.. వేరే దారిలేక వస్తున్నాయో తెలియదు కానీ.. మొత్తం జనం చుట్టూ తిరుగుతున్నాయి.. పెద్దపులి పేరు చెబితేనే ముచ్చెమటలు పడతాయి.. ఎందుకంటే ఎటునుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయం భయంగా ఉంటారు.ప్రస్తుతం పాపికొండల అభయారణ్యం నుంచి దారి తప్పి వచ్చిన పెద్దపులి మెట్ట ప్రాంతంలో సంచరిస్తుంది. పగలు దట్టమైన పొదల్లో దాగి ఉండి రాత్రి సమయాల్లో తన ప్రయాణాన్ని సాగిస్తుందని అటవీశాఖాధికారులు చెబుతున్నారు. ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి ఊరుకున్న అధికారులు ఆ పులిని పట్టుకునే సాహసం మాత్రం చేయడం లేదు ఎందుకో..

20 రోజుల కిందట వచ్చి వెళ్లింది..

గత 20 రోజుల కిందట పాపికొండలు అభయారణ్యంలోకి బయలుదేరిన పులి ఏలూరు జిల్లా కన్నాపురం, కొయ్యలగూడెం, నల్లజర్ల మండలాల మీదు గా ద్వారకా తిరుమల అటవీప్రాంతంలోకి వెళ్లింది.ఉన్నట్టుండి నల్లజర్ల నుంచి దేవరపల్లి మండల యాదవోలు పొలాల్లో ప్రత్యక్షమైంది.అక్కడ నుంచి మాతంగమ్మ మెట్ట చేరుకుని కరగపాడు రిజర్వ్ ఫారెస్ట్‌లో రెండు రోజులు మకాం వేసి అక్కడే ఒక రైతు పెంచుకుంటున్న పందిపై దాడి చేసి చంపింది.పులి పాదముద్రలు గమనించిన ప్రజలు ఎప్పటికప్పుడు అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన అటవీశాఖాధికారులు ఆ పాదముద్రలు పులివేనని నిర్ధారణ చేసి ఆ పరిసర ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.ఒంటరిగా పొలాలకు వెళ్లవద్దంటూ హెచ్చరికలు జారీ చేశా రు. అయితే మాతంగమ్మ మెట్ట ప్రాంతాల నుంచి పులి కదలికలు గమనించేందుకు ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసి న ట్రాప్ కెమెరాలకు చిక్కింది. దీంతో భారీ ఆకారంలో భయంకరంగా పెద్ద పులి ఉన్నట్టు అధికారులు గమనిం చారు. అనంతరం ఆ పులి కన్నాపురం అటవీప్రాతం నుంచి పాపికొండల అభయారణ్యంలోకి వెళ్లిపోయిందని అధికారులు నిర్ధారించారు.దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.పులి లేదని ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు.

అమ్మో మళ్లీ వచ్చేసింది..

అభయారణ్యం ఖాళీ అయ్యిందో లేక జనారణ్యమే నచ్చిందో కానీ మళ్లీ పెద్ద పులి వచ్చేసింది.. సుమారు వారం రోజుల పాటు అడవుల్లోనే ఉన్న పెద్ద పులి మళ్లీ గ్రామసంచారం మొదలుపెట్టింది. ఎటు నుంచి వచ్చిందో తెలియదుకానీ దేవరపల్లి గ్రామశివారులో ఉన్న బంధపురం, పోలవరం కుడికాల్వ గట్టుపై పులిపాదముద్రలు దర్శనమిచ్చాయి. పులి పాదముద్రలు గుర్తించిన ఆ ప్రాంత రైతులు ఉలిక్కిపడ్డారు. దీంతో అటవీశాఖాధికారులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వచ్చిన అటవీఅధికారులు పులిపాదముద్రలేనని నిర్ధారణ చేశారు. అత్యవసరం అయితే తప్ప సాయంత్రం సమయంలో బయటకు రావద్దని టాంటాం వేయించారు.

మూడు మేకలు హతం..

నిన్నమొన్నటి వరకు గోపాలపురం మండల పరిసర ప్రాంతంలోని చెరుకుమిల్లి, పెద్దాపురం గ్రామాల మధ్య సంచరించిన పెద్దపులి బుధవారం సాయంత్రానికి తాళ్ళపూడి మండలం మలగపల్లి గ్రామంలో ప్రవేశించింది. గురువారం తెల్లవారే సరికి తిరుగుముఖం పట్టిన పెద్దపులి గోపాలపురం మండలం కోమటిగుంట గ్రామ శివారులో ఉన్న మాతంగమ్మమెట్ట చేరుకుంది. అక్కడ నుంచి 30 కిలోమీటర్లు మేర ప్రయాణించి కరగపాడు రిజర్వ్‌ఫారెస్ట్‌లో ప్రవేశించింది. గురువారం ఉదయం అటవీ ప్రాంతంలో మేకల మందను మేపుతున్న బుచ్చయ్యపాలెం గ్రామానికి బొమ్మిన బాబూరావు రెండు మేకలను, జక్కువెంకన్నకు చెందిన ఒక మేకపై పెద్దపులి దాడి చేసింది. మూడు మేకలు మృతి చెందాయి. దాడి చేసి చంపిన మూడు మేకల్లో ఒక మేకను పెద్దపులి ఎత్తుకు వెళ్లినట్టు అధికారులు చెబుతున్నారు. కరగపాడు, బుచ్చయ్యపాలెం, ఎల్అండ్‌టీపేట, సాగిపాడు, దొండపూడి తదితర గ్రామాల పరిధిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

అధికారులు చేసిందేమిటి?

పాదముద్రలకే పరిమితం అయిన అటవీ అధికారులు. పాపికొండల అభయారణ్యం నుంచి రెండుసార్లు గ్రామాల్లోని మూడు నియోజకవర్గాల పరిధిలో గ్రామ సంచారం చేసిన పెద్దపులిని పట్టుకోవడంలో అటవీ అధికారులు విఫలమయ్యారని చెప్పాలి. ఆయా గ్రామాల శివారులో పంట పొలాల్లో ఉన్న పాదముద్రలను గుర్తించిన రైతులు ఇస్తున్న సమాచారం మేరకు ఆ పాదముద్రల వెంబడిస్తున్నారే తప్ప బోనులు ఏర్పాటు చేసి ఆ పులిని పట్టుకునే ప్రయత్నం మాత్రం నేటి వరకూ చేయలేదు.దీంతో ఏ ప్రాంతంలో పులి ప్రత్యక్షమవుతుందోనంటూ ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఇప్పటికైన అటవీఅధికారులు పులిని పట్టుకుని పాపికొండల అభయారణ్యంలో వదిలిపెట్టి భయాందోళన నివృత్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

స్వగ్రామంలోనే కొత్తపేట ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి

దళితుల నిరసన సెగ

- ఒక పక్క దళితుల ఆందోళన..
- మరోపక్క పోలీసు బందోబస్తు నడుమ పాఠశాల ప్రారంభోత్సవం
- ఎమ్మెల్యే దండ వేసిన అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం
- జగ్గిరెడ్డి దౌర్జన్యం నశించాలంటూ ఫ్లెక్సీ ఏర్పాటు


గోపాలపురం సిద్ధార్థనగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దౌర్జన్యం నశించాలంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన తెలుపుతున్న మహిళలు

రావులపాలెం, ఫిబ్రవరి 23: కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి తన స్వగ్రామంలోనే దళితుల నుంచి నిరసన సెగ తగిలింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు, గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇందులో భాగంగా సిద్ధార్థ నగర్‌వద్ద అవంతి ఫ్యాక్టరీ యజమాన్యం సమకూర్చిన నిధులతో నిర్మించిన ఎంపీపీ పాఠశాలకు జగ్గిరెడ్డి తండ్రి చిర్ల సోమసుందరరెడ్డి పేరు పెట్టడాన్ని ఆ ప్రాంతవాసులు వ్యతిరేకించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దౌర్జన్యం నశించాలంటూ ఫ్లెక్సీ ఏర్పాటుచేసి దళితులు నిరసన తెలిపారు. ఆ సమయంలో జగ్గిరెడ్డి అక్కడకు వచ్చారు. గతంలో అన్నపూర్ణ హోటల్‌లో అంబేడ్కర్ బొమ్మతో ఉన్న ప్లేట్ల వివాదంలో అమాయకులైన దళితులను జైలుకు పంపి ఇప్పుడు ఇక్కడికి ఎలా వచ్చారంటూ జగ్గిరెడ్డిని మహిళలు నిలదీశారు. ఒకపక్క నిరసనలు కొనసాగుతుండగానే మరోపక్క జగ్గిరెడ్డి అవంతి ఎండీ ఇంద్రకుమార్‌తో కలిసి పోలీసు బందోబస్తు నడుమ పాఠశాల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముందుగా అక్కడే ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి జగ్గిరెడ్డి పూలమాల వేశారు. అంబేడ్కర్‌ను అవమానించిన వారిని సమర్థించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అమాయకులైన దళిత యువకులను జైలుకు పంపి ఇప్పుడు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేయడం ఏమిటంటూ మరోమారు వివాదం తలెత్తింది. దీంతో పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కార్యక్రమం అనంతరం జగ్గిరెడ్డి అక్కడి నుంచి 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించేందుకు గ్రామంలోకి వెళ్లారు. సిద్ధార్థనగర్ యువకులు అంబేడ్కర్‌కు జగ్గిరెడ్డి వేసిన పూలదండలను తీసివేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దళితులను అక్రమ కేసులో ఇరికించి జైలుపాలు


సిద్ధార్థనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మహిళల ఆగ్రహం

చేసినప్పుడు అంబేడ్కర్ గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఎంపీపీ పాఠశాలకు సోమసుందరరెడ్డి పేరును వ్యతిరేకిస్తున్నామన్నారు. అంబేడ్కర్ పేరు పెట్టాలని శాంతియుతంగా నిరసన చేపట్టామన్నారు. వివాదం జరిగే అవకాశం ఉందనే సమాచారంతో జగ్గిరెడ్డి నియోజకవర్గ పరిధిలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలను భారీగా సమీకరించారని తెలిసింది.


సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

జగన్ మాదిగలను విస్మరించారు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

రావులపాలెం, ఫిబ్రవరి 23: ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉంటానని ఇడుపులపాయ సాక్షిగా మాటిచ్చి ఓట్లు వేసి గెలిపించిన అనంతరం జగన్ మాదిగలను విస్మరించారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. రావులపాలెంలోని కాపు కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజశేఖరరెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ వర్గీకరణకు పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. ఆయన మాట ఇస్తే కట్టుబడి ఉండేవారన్నారు. సీఎం జగన్‌కి తండ్రిలోని మంచి లక్షణాల్లో ఒక్కటి కూడా లేవన్నారు. అందుకు వర్గీకరణ అంశమే సాక్ష్యమన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్రానికి జగన్ విజ్ఞప్తి చేయలేదన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌కు కట్టుబడి ఉంటానని ఇడుపులపాయలో జగన్ హామీ ఇచ్చారన్నారు. దీంతో మాదిగలు ఓటు వేసి వైసీపీని గెలిపించారు. షెడ్యూల్ కులాల వర్గీకరణపై ఐదేళ్లలో వైసీపీ తీర్మానం చేయలేదని, అసెంబ్లీలో ఒక్క బిల్లు కూడా ప్రవేశ పెట్టలేదని, ఢిల్లీ వెళ్లి పెద్దలను కలిసివచ్చినప్పుడు కూడా వర్గీకరణపై మాట్లాడింది లేదన్నారు. వర్గీకరణ అంశం కోర్టులో నడుస్తున్న సమయంలో వాదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం లాయర్‌ను కూడా నియమించకపోవడం దారుణమన్నారు. మాదిగలను జగన్ ప్రభుత్వం పక్కనపెట్టిందన్నారు. వర్గీకరణకు అనుగుణంగా ఉండను మీరు ఓటు వేస్తే వేయండి లేకపోతే లేదు అన్న చందంగా జగన్ వ్యవహరిస్తున్నారన్నారు. ఎస్సీ కులాల వర్గీకరణపై ఏ పార్టీ అనుకూలంగా ఉందో తెల్చుకుంటామన్నారు. జగన్, చంద్రబాబు, పవన్, బీజేపీలతోపాటు అన్ని ప్రధాన పార్టీల నాయకులను కలిసి వారి వైఖరిని తెలుసుకుంటామన్నారు. ఎస్సీ వర్గీకరణకు నిర్దిష్ట హామీఇచ్చి మేనిఫెస్టోలో పెట్టిన పార్టీకే మద్దతు ఇస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణతో సంబంధంలేదని మౌనం వహిస్తున్న వైసీపీఅయినా మరి ఏపార్టీ అయినా వ్యతిరేకిస్తామని కృష్ణమాదిగ చెప్పారు.

లారీలో రూ.9 లక్షలు విలువైన గంజాయి స్వాధీనం

- ముగ్గురు నిందితుల అరెస్ట్

రాజానగరం, ఫిబ్రవరి 23: ప్రయాణికుల ముసుగులో లారీలో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు నిందితులు మార్గమధ్యలో రాజానగరం పోలీసులకు చిక్కారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాతీయ రహదారిపై తూర్పుగోనగూడెంవద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో లారీలో గంజాయి తరలిస్తున్నట్టు ముందుగా అందిన సమాచారం మేరకు నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, సీఐ కె.కాశీవిశ్వనాథ్ పర్యవేక్షణలో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బీహార్‌కు చెందిన మహమ్మద్ మహర్భాజ్ అలం, కేరళకు చెందిన వడకల్ వలపిన్ రాజేష్‌కుమార్, ఏలూరు జిల్లా చేబ్రోలు గ్రామానికి చెందిన తాకాసి శివ అలియాస్ శివాజీ నర్సీపట్నం ఏజెన్సీ ప్రాంతం నుంచి 23.5 కిలోల గంజాయిని ప్రయాణికులు మాదిరిగా లారీ ఎక్కి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో తూర్పుగోనగూడెంవద్ద పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్టు చేశామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.9 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ మనోహర్ కేసు నమోదు చేసినట్టు చెప్పారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కాశీవిశ్వనాథ్


మాణిక్యాంబ సమేత భీమేశ్వరుడి రథోత్సవం

హరహర ధ్వానాలతో ..

భీమేశ్వరుడి రథోత్సవం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపుర మండలం ద్రాక్షారామ భీమేశ్వరుని కల్యాణ మహోత్సవంలో భాగంగా భీమేశ్వర స్వామివారి రథోత్సవం శుక్రవారం భక్త కోలాహలంతో వైభవంగా జరిగింది. మధ్యాహ్నం కల్యాణమూర్తులైన మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామి వార్లను పుష్పాలంకృతమైన రథంపై అర్చకస్వాములు అధిష్టింప చేశారు. దూపసేవ అనంతరం 2.30 గంటలకు ఈవో పీటీవీ సత్యనారాయణ కొబ్బరికాయ కొట్టి రథోత్సవం ప్రారంభించారు. స్వామివారి రథం ఆలయంవద్ద నుంచి చంద్రవీధి గుండా వెలంపాలెం చేరుకుని సూర్యవీధి మీదుగా మెయిన్‌రోడ్డు చేరుకుంది. తదుపరి మార్కెట్, యానాం సెంటర్ నుంచి వేగాయమ్మపేట చేరుకుంది. రథంలో ఆశీనులైన కల్యాణమూర్తులు స్వామి, అమ్మవార్లను పుర వీధులలో భక్తులు దర్శించుకున్నారు.

ఘనంగా ఆస్థాన పూజ

రాత్రి 6.30కు ఆస్థాన మండపంలో కల్యాణమూర్తులకు ఆస్థాన పూజ జరిగింది. వేద స్వస్తి అనంతరం పూజలు నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పం కార్యక్రమంతో ఆస్థాన పూజ ముగిసింది. కార్యక్రమంలో వాడ్రేవు సుందరరత్నకరావు, ఆలయ ఈవో పి.టి.వి సత్యనారాయణ, ఆలయ సిబ్బంది, ఆలయ ఆస్థాన పండితులు దేవులపల్లి ఫణిరామకృష్ణ, అర్చకులు, వేదస్వస్తి వాచక బృందం, భక్తులు పాల్గొన్నారు. రథోత్సవం పురస్కరించుకుని రామచంద్రపురం సీఐ దొర రాజు ఆధ్వర్యంలో ఎస్‌ఐ సురేంద్ర పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు విజయానంద్ ఆదేశాలతో సిబ్బంది విద్యుత్‌సరఫరా క్రమబద్ధీకరించి విద్యుత్‌కండక్టర్లు, వైర్లు తొలగించారు. రథోత్సవం అనంతరం పునరుద్ధరించే పని చేపట్టారు.

వేడుకగా నరసన్న గ్రామోత్సవాలు

- అర్చకుల సమక్షంలో చోర సంవాదం వేడుకలు
- స్వామివారి చక్రస్నానానికి భారీ ఏర్పాట్లు


రాజాధిరాజా వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

అంతర్వేది, ఫిబ్రవరి 23: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం 4గంటలకు స్వామివారు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి రామరాజు, వెంకటసత్యనారాయణరాజులచే నిర్మితమైన రాజాధిరాజా వాహనంపై గ్రామపురవీధుల్లో ఊరేగారు. అనంతరం సాయంత్రం 6గంటలకు ధూపసేవ, 7గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లివారి కుటుంబీకులచే నిర్మితమైన అశ్వవాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ఛైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, వనమాలి మూలాస్వామి, వలవల రాంబాబు భక్తులు పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయంలో చోర సంవాదం

అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారంరాత్రి 7.30గం టలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు ఉండపల్లి, బెల్లంకొండ కుటుంబీకులచే నిర్మితమైన అశ్వవాహనంపై స్వామివారిని 16మండపాల స్తంభం వద్దకు తీసుకువచ్చారు. ఆలయ అర్చకుల సమక్షంలో చోర సంవాదం వేడుకలు నిర్వహించారు. దారి దోపిడీ దొంగకు, భగవంతుని మధ్య జరిగిన సంభాషణను అర్చకులు తమిళంలో చదివారు. దారి దోపిడీ దొంగగా మారిన పరకాలుడు అనే మహరాజు మారువేషంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహుడిని కూడా దోచుకుంటాడు. మహా విష్ణువు ఆయనను మంచివాడిగా చేసి ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేసిన పరకాలుడు పేరును తిరుమంగల్వార్‌గా మార్చి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తారు. ఈ సంభాషణను సున్నాలు, పన్నాలు పేరుతో వైష్ణవోపేతంగా ఆలయ స్థానాచార్యులు, వేద పండితులు, అర్చకులు పఠించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి వెంకట శ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితులు చింతా వెంకటశాస్త్రి, అర్చక స్వాముల సారథ్యంలో నిర్వహించారు.


సముద్రం వద్ద చక్ర(జల్లు)స్నానం ఏర్పాట్లపై చర్చిస్తున్న ఏసీ సత్యనారాయణ, ఎస్‌ఐ రాము, రాజాబహుదూర్

నేడు స్వామివారికి చక్రస్నానం

అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం ఉదయం శ్రీ స్వామివారికి చక్రస్నానం జరగనుంది. ఈసందర్భంగా రుద్రరాజు బంగారమ్మ బహూకరించిన గరుడ పుష్పక వాహనంపై స్వామివారి ఆలయంవద్ద నుంచి సముద్రంవద్దకు బయలుదేరి అనంతరం చక్రవారి అవభృదోత్సవం సముద్ర స్నానం, వసంత మండపం వద్ద ప్రత్యేక పూజలు, అనంతరం ధ్వజారోహణ జరుగుతుంది. ప్రత్యేక బృందాలతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సీఐ, ఎస్‌ఐలు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఆలయం వద్ద క్యూలైన్లు, సముద్ర స్నానాల వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్టు ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. ఎటువంటి తొక్కిసలాట జరుగకుండా బారీ కేడ్లు ఏర్పాటు చేశామన్నారు. సముద్రంవద్ద సుమారు వంద మీ టర్ల మేర ప్రత్యేక కర్రలతో బారికేడ్లు కట్టి స్వామివారి చక్రపెరుమాళ్ స్నానమాచరించే ప్రదేశంవద్ద ఏర్పాట్లు చేశారు. చక్రస్నా నం ఏర్పాట్లను ఏసీ సత్యనారాయణ పరిశీలించారు.

ప్రాచీన సుదర్శన పెరుమాళ్ స్వామి..

రాష్ట్రంలో మరెక్కడా లేనటువంటి ప్రాచీన సుదర్శన పెరుమాళ్ స్వామివారిని మాఘమాసంలో పౌర్ణమిరోజున భక్త లు శిరస్సుపై ఉంచుకుని సము ద్రస్నానం చేయడం మోక్షప్రదం, ముక్తిదాయకమని ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ తెలిపారు. స్వామివారి పంచబేరల్లో (ధ్రువ, కౌతుక, ఉత్సవ, స్నపన, బలిబేరం) బలిబేరం ఒకటి, చోడష బాహువులు, చోడష ఆయుధాలతో కూడిన ఈ విగ్రహం చుట్టూ జ్వాలలు వెనుక సుదర్శన యంత్రం కిందన గరుడ వాహనం ఉంటాయని తెలిపారు.


చక్రపెరుమాళ్


అశ్వవాహనంపై స్వామివారి గ్రామోత్సవం దృశ్యం

నేడు గరుడ పుష్పక వాహనంపై గ్రామోత్సవం

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం తెల్లవారుజామున 3గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సుప్రభాతసేవ మొదలుకొని శ్రీస్వామివారి తిరువారాధన, బాలభోగం, వార్షిక అభిషేకాలు నిర్వహిస్తారు. ఉదయం 8గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు రుద్రరాజు బంగారమ్మ వారిచే నిర్మితమైన గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతుంది.

రేపు స్వామివారి తెప్పోత్సవం

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగం గా ప్రతి సంవత్సరం భీమవరానికి చెందిన గొట్టిముక్కల భీమరాజు తెప్పోత్సవానికి అయ్యే ఖర్చును విరాళంగా ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం సాయంత్రం దేవస్థానం చెరువులో మిరిమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణల నడుమ బాణసంచా కాల్పులతో హంస వాహనంపై స్వామివారి తెప్పో త్సవం జరుగుతుంది.

ఆర్మీ మాజీ మేజర్ మృతి


నేకూరి మల్లేశ్వరరావు(ఫైల్)

రావులపాలెం, ఫిబ్రవరి 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలేనికి చెందిన ఆర్మీ మాజీ మేజర్ నేకూరి మల్లేశ్వరరావు (84) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. ఈయన సుదీర్ఘ కాలం మేజర్‌గా పని చేశారు. మల్లేశ్వరరావు మృతదేహాన్ని ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సందర్శించి సంతాపం తెలిపారు.

రెండు కార్లు ఢీ

- ఆరుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 23: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. విశాఖపట్టణం నుంచి విజయవాడ వెళుతున్న కారును కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడి వద్దకు వచ్చేసరికి ఎన్‌హెచ్16పై గల జ్యూస్‌ఫ్యాక్టరీ సమీపంలో ఐషర్ వ్యాను ఢీకొంది. దీంతో కారు అదుపుతప్పి డివైడర్ దాటి ఏలేశ్వరం నుంచి గొల్లప్రోలు వెళుతున్న కారుని ఢీకొంది. ప్రమాదంలో గొల్లప్రోలు వస్తున్న కారులో ప్రయాణిస్తున్న మొయిళ్ల శ్రీనివాసరావు, మర్రి కృష్ణలకు, గుడాల లక్ష్మీ, శ్రీనివాసరావు, రాజారావు, శోభనలకు గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

రేపు ఉమ్మడి జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు

- ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రారు దుర్గాప్రసాద్ వెల్లడి

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 23 : ఈనెల 25వ తేదీన కాకినాడ రెవెన్యూ భవన్‌లో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆల్ ఆంధ్రప్రదేశ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రారు, కోపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. దుర్గాప్రసాద్ వెల్లడించారు. ఈమేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఏపీజేఏసీ అమరావతి సభ్య సంఘమైన ఆల్ ఆంధ్రప్రదేశ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు తనను ఎన్నికల అధికారిగా నియమించారని తెలిపారు. అందువల్ల సంఘం నియమావళి ప్రకారం షెడ్యూల్ ప్రకటించామన్నారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 25వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి కాకినాడ కలెక్టరేట్ ఎదురుగా గల రెవెన్యూ భవన్‌లో ఎన్నికలు జరుగుతాయన్నారు. అందువల్ల సభ్యులందరూ ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు హాజరై సహకరించాలని ఎన్నికల అధికారి దుర్గాప్రసాద్ తెలియజేశారు.

లక్కవరం రేంజ్‌లో

ఏపీ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి పర్యటన

మోతుగూడెం, ఫిబ్రవరి 23: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో లక్కవరం రేంజ్‌లో శుక్రవారం ఏపీ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి చిరంజీవిచౌదరి సుడిగాలి పర్యటన చేశారు. బేస్ క్యాంప్ వద్ద గొంది గూడెం బీట్‌లో 1962 టేకు ప్లాంటేషన్‌ను పరిశీలించి ఆ చెట్లు ఎంత పెరిగాయో ఫారెస్ట్ సిబ్బందితో కొలతలు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని అడవిలో మంటలు చెలరేగి కారుచిచ్చులపై అటవీ అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. లక్కవరం సబ్ డివిజన్ కార్యాలయంను సందర్శించి అక్కడ జరుగుతున్న విశ్రాంతి భవనం, రేంజ్ కార్యాలయం పనులను పరిశీలించారు. ఆయన వెంట సీసీఎఫ్ శ్రీనివాసరెడ్డి, డీఎఫ్‌వో పుష్ప సౌజన్య, లక్కవరం రేంజ్ నానాజీ, బీట్ ఆఫీసర్ వెంకట్ రాందాసు, ఫారెస్ట్ సిబ్బంది ఉన్నారు.


చెట్లను పరిశీలిస్తున్న ఏపీ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి చిరంజీవి చౌదరి, కార్చిచ్చుపై సలహాలు, సూచనలు ఇస్తున్న దృశ్యం

రైలులో ప్రయాణికురాలికి అస్వస్థత

- సామర్లకోట రైల్వే అధికారుల సహకారంతో వైద్యం అందజేత

సామర్లకోట, ఫిబ్రవరి 23: సికింద్రాబాద్ నుంచి భువనేశ్వర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న సుమారు 57 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రయాణికురాలికి తీవ్ర అస్వస్థత కలగడంతో సామర్లకోట రైల్వే అధికారులకు సహచర ప్రయాణికులు సమాచారం అందివ్వడంతో సామర్లకోట రైల్వే పోలీసుల సహాయంతో సామర్లకోట స్టేషన్‌లోని సదరు ప్రయాణికురాలిని దింపి సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి వాహనంలో హుటాహుటిన తరలించారు. ఆసుపత్రి వైద్యులు వెంటనే వైద్యం అందివ్వడంతో కోలుకున్నారు శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనలో ప్రయాణికురాలికి మెరుగైన వైద్యం అందించేందుకు అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందించేందుకు సహకరించిన రైల్వే అధికారులకు, రైల్వే పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



పోలీసుల అదుపులో

ముగ్గురు దోపిడీ దొంగలు

నల్లజర్ల, ఫిబ్రవరి 23: నల్లజర్ల మండలం పోతవరం షుగర్ ఫ్యాక్టరీవద్ద దారి దోడిపీకి పాల్పడ్డ ఐదుగురు వ్యక్తుల్లో ముగ్గురు పోలీసులకు చిక్కారు. బుధవారంరాత్రి భీమవరం పట్టణానికి చెందిన నగల వ్యాపారి బాలు నాతురామ్ కారును సిని ఫక్కీలో రెక్కీ నిర్వహించి పోతవరం షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఐదుగురు వ్యక్తులు ఇన్నోవా కారులో వచ్చి ఇన్‌కామ్‌ట్యాక్స్ అధికారులమని బెదిరించి వారి వద్ద 3.5కిలోల బంగారు ఆభరణాలు, రూ.5లక్షల నగదుతో పారిపోయారు. దోపిడీకి పాల్పడ్డ ఐదుగురిలో ముగ్గురిని కొవ్వూరు డీఎస్పీ రామారావు తమ సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కొంతమంది బంగారు షాపుల్లో పనిచేసే వారి సమాచారంతో ఈ కుట్రకు పాల్పడినట్లు తెలుస్తోంది. కారు లోపల అనుసంధానంగా నిర్మించిన లాకర్ తాళం యాజమాని బాలువద్ద ఉండగానే చోరీ ఏలా జరిగిందనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. దారి దోపిడీ ముఠాకు సమాచారం, సహకరించిన వారి వివరాలు సేకరిస్తున్నారు.

భీమేశ్వరుడి అన్నదానట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 23: ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దేవస్థానం అన్నదానట్రస్టుకు శుక్రవారం రామచంద్రపురం మండలం తోటపేటకు చెందిన డా.పోతుల వీరవెంకట సత్యనారాయణ రూ.1,00116 విరాళం అందజేశారు. తోటపేటలో 35 ఏళ్లుగా ప్రైవేటువైద్యుడిగా పనిచేస్తున్న సత్యనారాయణ సదరు విరాళం ఈవో పి.టి.వి. సత్యనారాయణకు అందజేశారు.


విరాళం అందజేస్తున్న వైద్యుడు సత్యనారాయణ

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

గోదావరి మాతకు మహానీరాజనం

కొవ్వూరు, ఫిబ్రవరి 23: అఖండ గౌతమీ గోదావరిమాతకు మహా నీరాజనం అందజేశారు. శుక్రవారం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలో గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో మాఘ పౌర్ణమి సందర్భంగా 221వ మాసోత్సవ మహా నీరాజనం నిర్వహించారు. గోదావరిమాతకు పూజలు చేసి, వివిధ రకాల హారతులు అందించారు. మహిళలు నేతి దీపాలను గోదావరిలో వదిలారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే ప్రకృతి రావణ బ్రహ్మ శివాలయంలో అన్నపూర్ణమ్మ సమేత మల్లికార్జునస్వామి సన్నిధిలో శ్రీచక్రానికి మహిళలు కుంకుమ పూజలు చేశారు.

ఏజెన్సీ సమాచారం



రేఖపల్లి జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదింపండి

వరరామచంద్రాపురం, ఫిబ్రవరి 23: కేంద్రంలో రైతు వ్యతిరేక నల్లచట్టాలను తెచ్చి అన్నదాతల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రేఖపల్లి జంక్షన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. హర్యానాలో రైతులు తమ న్యాయమైన సమస్యల సాధనకు శాంతియుత పద్ధతుల్లో ఆందోళన చేస్తుంటే వారిపై బాష్పగోళాలు రబ్బర్ తూటాలను ప్రయోగించడం హేయమైన చర్య అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారా యణ తీవ్రంగా ఖండించారు. బీజేపీ నిరంకుశ ధోరణి వలన దేశానికి అన్నంపెట్టే రైతులపై ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడడం అన్యాయమన్నారు. ఈ ఆందోళనలో యువరైతు ప్రాణాలు కోల్పోయాడని, ఆకుటుంబాన్ని తక్షణమే ఆదుకోవాలని, నల్ల చట్టాలను వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా బీజేపీ తనవైఖరిని మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సోయం చినబాబు, నాయకులు రైతు సంఘాల నాయకులు పంకు సత్తిబాబు, వడ్లాది రమేష్, కుంజా నాగిరెడ్డి, సీహెచ్ సుబ్బారావు, నాళ్ళారపు ప్రకాష్, జి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఘనంగా రాజులుబాబు పండుగ

వై.రామవరం, ఫిబ్రవరి 23: మండలంలో శుక్రవారం పలు గ్రామాల్లో అడవి రాజులుబాబు పండుగను ఘనంగా జరుపుకున్నారు. వై.రామవరం, యార్లగడ్డ, పనసలపాలెం, చవిటిదిబ్బలు తదితర గ్రామాల శివార్లలో మామిడిచెట్ల కింద రాజులబాబుకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోడిమాంసాలతో సహపంక్తి భోజనాలు నిర్వహించి సందడి చేశారు.

రుద్రకోట గోదావరి రేవు వేలంపాట

కూనవరం, ఫిబ్రవరి 23: వచ్చేనెల మార్చి 1వ తేదీన కూనవరం రుద్రమకోట గోదావరి రేవు వేలంపాట నిర్వహించనున్నట్లు మేజర్ పంచాయతీ ఈవో సురేష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10.30గంటలకు ఈ వేలంపాట నిర్వహిస్తామని కేవలం గిరిజనులు మాత్రమే పాల్గొనాలని ఆయన తెలిపారు. పాటలో పాల్గొనేవారు దరావత్తు కింద రూ.10వేలు చెల్లించాలన్నారు. దాంతోపాటు సాల్వెన్సీ రూ.5లక్షలు కట్టాలన్నారు. తుదినిర్ణయం పంచాయతీ సిబ్బందిదేనన్నారు.

ఐటీడీఏ పాలకవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేయాలి

● మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు



రంపచోడవరం, ఫిబ్రవరి 23: రంపచోడవరం, చింతూరు ఐటీడీఏలలో తక్షణమే పాలకవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. జీవో నెం.57 ప్రకారం ప్రతి మూడు నెలలకొకసారి పాలకవర్గ సమావేశం జరగాల్సివున్నా వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. చివరిసారి పాలక వర్గ సమావేశం 2019, డిసెంబరులో జరిగిందని, నేటికి నాలుగు సంవత్సరాలు పూర్తయినా సమావేశం నిర్వహించకపోవడం దారుణమన్నారు. పాలకవర్గ సమావేశం నిర్వహించక పోవడా నికి గల కారణాన్ని ప్రభుత్వమే ప్రకటన చేయాలన్నారు. గి రిజన ప్రాంత అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో విధులు నిర్వహించే వివిధ శాఖల ఉద్యోగులు పనిలేక నిశబ్దంగా ఉన్నారన్నారు. అప్పులతో రాష్ట్రాన్ని పాలిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంత అభివృద్ధి, సంక్షేమానికి నిధులు ఇవ్వకపోగా అలాగే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన సబ్‌ప్లాన్ నిధులు కూడా ఖర్చు చేయకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసిన గృహాలను కూడా నిర్మించలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం గిరిజన ప్రాంత అభివృద్ధిని పూర్తిగా విస్మరిం చిందన్నారు.

రైతులు దళారుల నుంచి మోసపోకుండా చర్యలు

● ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, ఫిబ్రవరి 23: గిరిజన రైతులు దళారుల నుంచి మోసపోకుండా చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ రైతులు పండించిన జాఫ్రా గింజలు కొనుగోలు చేసేందుకు ఐదుగురు సభ్యులు పీహెచ్‌వోలు ఎల్.రాంబాబు, కె.చిట్టిబాబు, ఉపాధి పథకం ఏపీడీ జి.శ్రీనివాస రావు, వెలుగు డీపీఎం పరమేశ్వరరావు, హెచ్‌వో ముత్తయ్యలతో కమిటీని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కిలో జాఫ్రా గింజలు రూ.150లకు కొనుగోలు చేసేందుకు ఎస్.ఎన్. ఆగ్రో ఎగ్జిమ్స్ తుని వెండర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. 200 మెట్రిక్ టన్నుల జాఫ్రాలను కొనుగోలుచేసే విధంగా చర్యలు చేపట్టామ న్నారు. గ్రామాల్లో రైతులు మోసపోకుండా డిజిటల్ కాటాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే జీడిమామిడి పిక్కలు, చింతపండు, పసుపును కూడా కొనుగోలు చేయాలని ఎస్.ఎన్.ఆగ్రో ఎగ్జిమ్ ప్రనిధులను కోరారు. కార్యక్రమంలో ఆగ్రో ఎగ్జిమ్ ప్రతినిధి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

5400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



రంపచోడవరం, ఫిబ్రవరి 23: అల్లూరి సీతారామరాజుజిల్లా ఎస్పీ తూహిన్‌సిన్హా, జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఎస్.శ్రీనివాస రావు ఆదేశాల మేరకు అడ్డతీగల మండలం గొంటువానిపాలెంలో దాడులు నిర్వహించి 5400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఇంటెలిజెన్స్ వింగ్ సీఐ నాగ రాహుల్ తెలిపారు. 55 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని మూడు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం రవాణా, అమ్మిన తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడుల్లో రంపచోడవరం, ప్రత్తిపాడు సబ్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

చాపరాయి యువతకు వాలీబాల్ కిట్లు అందజేత

మోతుగూడెం, ఫిబ్రవరి 23: డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో చాపరాయి గ్రామ యువతకు డొంకరాయి ఎస్ఐ శివకుమార్ వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా డొంకరాయి ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ క్రీడలతో యువత ఆరోగ్యంగా ఉండటంతోపాటు చెడు అలవాట్లు దూరంగా ఉంటారని, ఆక్టివ్ గా ఉంటూ మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అందువల్ల యువత గంజాయి వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూ రంగా ఉండాలని క్రీడలవైపు అడుగులు వేయాలన్నారు.



యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న డొంకరాయి ఎస్ఐ శివకుమార్

టీడీపీలోనే రజకులకు రాజకీయ ప్రాధాన్యం

▸▸ రజక భరోసా బాట ఆత్మీయ సభలో ఎమ్మెల్సీ రామారావు



ఎమ్మెల్సీ రామారావును సత్కరిస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, ఫిబ్రవరి 23: రజకులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన ఘనత టీడీపీదేనని ఎమ్మెల్సీ, టీడీపీ ప్రధాన కార్యదర్శి దువ్వారపు రామారావు అన్నారు. బిక్కవోలులో శుక్రవారం రజక చైతన్య సేవాసంస్థ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు అధ్యక్షతన రజక భరోసా బాట ఆత్మీయ సభ జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా ఆయనతో పాటు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ రజకుల సంక్షేమానికి ఎన్నో విధాలుగా టీడీపీ కృషి చేసిందని, ఎస్సీ జాబితాలో చేర్చేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపిందని, అధ్యయన కమిటీ వేసిందని, అలాగే దోబీఘాట్‌లు, ఉచిత విద్యుత్, ఆదరణ ద్వారా పనిముట్లు అందజేసిందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ఓట్లేసి, రామకృష్ణారెడ్డిని గెలిపించాలని రజకులకు పిలుపు నిచ్చారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రజకులకు చట్ట సభల్లో రాజకీయ ప్రాధాన్యం కల్పించింది టీడీపీయేనని, రజక మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడానికి బీసీ రక్షణ చట్టాన్ని మానిఫెస్టోలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. రజకులకు శాసన సభలో, టీటీడీ పాలక మండలిలో ప్రవేశం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్సీ రామారావును రామకృష్ణారెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రజక నేతలు రామకృష్ణ, వెంకటరమణయ్య, దేశం నేతలు పాలచర్ల శివప్రసాదచౌదరి, గొర్రెల త్రిమూర్తులు, రాయుడు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

యువరైతు మృతికి మోదీ ప్రభుత్వానిదే బాధ్యత



రాజమహేంద్రవరంలో నిరసన ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

▸▸ రాజమహేంద్రవరంలో కార్మిక సంఘాల నేతల నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 23: న్యాయమైన హక్కుల కోసం ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేస్తున్న పోరాటంపై మోదీ ప్రభుత్వం దమనకాండను సాగించడంతో యువ రైతు మృతిచెందాడని, దీనికి మోదీ ప్రభుత్వానిదే బాధ్యత అని పలు కార్మిక సంఘాలు, రైతు, ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీల నాయకులు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం శ్యామలాసెంటర్‌లో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఏపీ రైతు సంఘం, ప్రజాసంఘాలు, సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ పార్టీల ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతు ఉద్యమంపై మోదీ ప్రభుత్వం దాడిని అందరూ ఖండించాలని, రైతాంగాన్ని కార్పొరేట్లకు బానిసలుగా చేసే బీజేపీని చిత్తుగా ఓడించాలన్నారు. మొదటి దశ రైతు ఉద్యమం సందర్భంగా మోదీ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం వల్లే రెండవ దఫా రైతు ఉద్యమం ప్రారంభమైందని వివరించారు. యువరైతు మృతిపై న్యాయవిచారణ జరిపించాలని, రైతులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సీపీఐ ఎంఎల్ నగర కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, నాయకులు పవన్, టీఎస్ ప్రకాష్, ఎస్ఎస్ మూర్తి, నల్ల రామారావు, సావిత్రి, భానుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అవినీతి పాలనకు త్వరలో చరమగీతం

▸▸ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి ఫిబ్రవరి 23: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అవినీతి పాలనకు చమరగీతం పాడే సమయం దగ్గర పడిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం కుతుకులూరులో ఆయన ఇంటింట ప్రచారం నిర్వహించారు. ప్రజలు అనేక చోట్ల హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్క చాన్స్ పేరుతో జగన్‌కు పరిపాలన అందించి అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని, ఆలోచించి ఓటు వేయాలని, చంద్రబాబు పాలనతోనే అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో టీడీపీ-జనసేన కూటమి 160 స్థానాల్లో విజయం సాధించి సుస్థిర పాలన అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, పడాల వెంకట సుబ్బారెడ్డి, రామారెడ్డి, తమలంపూడి సూర్రెడ్డి, పులగం అచ్చిరెడ్డి, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలవరంలో మహాలక్ష్మి ఇంటింటి ప్రచారం

రంగంపేట, ఫిబ్రవరి 23: మండలంలోని జి.దొంతమూరు గ్రామ శివారు



కుతుకులూరులో మహిళకు నమస్కరిస్తున్న రామకృష్ణారెడ్డి

బాలవరంలో శుక్రవారం టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల ద్వారా పొందే లబ్ధిని వివరిస్తూ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి నల్లమిల్లి మహాలక్ష్మి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. గ్రామంలో కరపత్రాలు పంచుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, నీలపాల త్రిమూర్తులు, వెలుగుబంటి సత్తిబాబు, ఉద్దండ్రావు శ్రీను, అడబాల వెంకటరావు, మాచిన వెంకన్నదొర, దూళ్ల ధర్మరాజు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను నిరోధించాలి

మెజీషియన్ డాక్టర్ స్టిక్ మనోహర్



పీసీ సర్కార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మనోహర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 23: సమాజంలో మూఢనమ్మకాల నిరోధానికి మెజీషియన్లు కృషి చేయాలని మెజీషియన్ డాక్టర్ ఎస్.మనోహర్ (స్టిక్ మనోహర్) పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం శ్యామల సెంటర్ ఇంద్రజాల నిలయంలో శుక్రవారం జాతీయ ఇంద్రజాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత మ్యాజిక్ ద్వారా పీసీ సర్కార్ సీనియర్ చిత్రపటాన్ని సృష్టించి పూలమాలలతో నివాళులర్పించారు.అనంతరం యువ మెజీషియన్ శోభిత్ వర్మ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మెజీషిన్లు అందరూ తమతమ ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మెజీషియన్లు పసల భీమన్న, సిహెచ్ శ్రీరాములు, గౌరీ శంకర్ బియాని, చల్లగాలి శ్రీనివాస వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సూర్యకల్యాణోత్సవం



సీతంపేటలో సూర్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న కుమార్‌శర్మ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 23: రాజమహేంద్రవరం సీతంపేట లో నిర్వహిస్తున్న షోడశ దిన ప్రయుక్త పంచాయతన పూర్వక సూర్యారాధనలో భాగంగా శుక్రవారం సూర్యభగవానుడికి విశేష పూజలు చేశారు. యాగ నిర్వాహకులు వడలి కుమార్ శర్మ ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు, హోమాలు చేశారు. శత చండీ పారాయణం, సుదర్శన మంత్రానుష్ఠానం హోమం, లక్ష్మీ గణపతి జపం , చతురావృతతర్పణ, అష్టద్రవ్య హోమాలు, శ్రీపద్మిని సౌంజ్ఞాచ్ఛాయ ఉషా సమేత సూర్యకల్యాణం అత్యంత భక్తి శ్రద్ధలతో చేశారు. ఈనెల 24న శ్రీ మహాలక్ష్మి ఆరాధనలు, జ్యోతిర్లింగార్చన జరుగుతుందన్నారు. 25న పూర్ణాహుతి జరుగుతుందన్నారు.

మాలలకు జనసేన సీటు కేటాయించాలి

మాల మహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటు శ్యాం రవిప్రకాష్

కొవ్వూరు, ఫిబ్రవరి 23: రాజమహేంద్రవరం పార్లమెంటు పరిధిలో కొవ్వూరు, గోపాలపురం రిజర్వుడు నియోజకవర్గాల్లో ఒకటి జనసేన తరపున మాల సామాజికవర్గానికి కేటాయించాలని మాల మహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటు బొంతా శ్యాంరవిప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కొవ్వూరులో పాత్రికేయులతో మాట్లాడుతూ జనసేన అధ్యక్షుడు మొట్టమొదటిగా దివంగత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య గృహాన్ని సందర్శించి పర్యాటక కేంద్రంగా గుర్తింపు తీసుకురావాలనే ఆలోచనతో రూ.1 కోటి విరాళం ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేశారు. కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో ఒకటి మాలలకు కేటాయించి సముచిత స్థానం కల్పిస్తే రాష్ట్ర వ్యాప్తంగా పవన్‌కల్యాణ్‌కు మద్దతు వస్తుందన్నారు. రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోయాయని వాటిని అరికట్టడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు.

వైభవంగా అనంత పద్మనాభుడి గ్రామోత్సవం

కోరుకొండ, ఫిబ్రవరి 23: కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి దివ్య అధ్యయనోత్సవాలు 4వ రోజు శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం అధ్యాపక స్వాములు ద్రవిడ వేదాన్ని పారాయణం చేస్తున్నారు. సాయత్రం శ్రీ భూ సమేత అనంత పద్మనాభ స్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మంగవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణలతో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. అంతకుముందు ప్రత్యేక సేవా కాలం నిర్వహించారు. దిగువ దేవస్థానం వద్ద అనువంశక ధర్మకర్తలు పరాసర లక్ష్మీనరసింహ భట్టర్, పరాసర రంగరాజభట్టర్, రఘునాథ భట్టర్, పెద్దింటి, పెరవళి, పెదపాటి అనువంశక అర్చక స్వాములు, గ్రామస్థులు పాల్గొన్నారు.



అశ్వ వాహనంపై అనంత పద్మనాభస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న పండితులు

నేటి నుంచి త్రిమూర్తులుస్వామి తీర్థం

రాజానగరం, ఫిబ్రవరి 23: మండలంలోని నరేంద్రపురంలో స్వయంభూ నాగదేవతా స్వరూప శ్రీత్రిమూర్తులు స్వామి తీర్థ మహోత్సవాలను ఈ నెల 24 నుంచి ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణం, నిత్య అన్నసమారాధన జరుగుతాయని చెప్పారు. త్రిమూర్తులుస్వామిని దర్శించుకుంటే సంతాన భాగ్యం, వివాహ యోగం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు.

ఓపీఎస్‌కు హామీ ఇచ్చే వారికే మద్దతు



పలివెల వీరబాబుకు వినతిపత్రం అందిస్తున్న టీచర్స్ ఫెడరేషన్ నాయకులు

సీతానగరం, ఫిబ్రవరి 23: ఉద్యోగులకు పాత పింఛను విధానం అమలు చేస్తామని ఏ పార్టీ ఖచ్చితమైన హామీ ఇస్తుందో వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకే మద్దతు ఇస్తామని ఏపీ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం చినకొండేపూడిలోని సీపీఐ ఎంఎల్ పార్టీ నాయకుడు పలివెల వీరబాబు కార్యాలయం వద్ద ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ వల్ల నష్టపోతున్నామని, ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పురుషోత్తపట్నంలో 'ఆరోగ్య సురక్ష'

సీతానగరం, ఫిబ్రవరి 23: పురుషోత్తపట్నంలోని ఎంపీయూపీ పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్షా శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 416 మందికి సిద్ధార్థ నర్సింగ్ హోం వైద్యులు కీళ్ల వ్యాధుల స్పెషలిస్ట్ డాక్టర్ డి.మౌనిష్, హృద్రోగ నిపుణులు డాక్టర్ స్నేహరెడ్డి సేవలందించారు. 83 మందికి డాక్టర్ సత్యప్రసాద్ కంటి పరీక్షలు నిర్వహించి 61 మందిని కళ్లజోళ్లకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, చల్లమళ్ళ సుజిరాజు ఎంపీహెచ్ఈవో యర్రా సుబ్బారాయుడు, సూపర్‌వైజర్లు కె.సుధాకర్, డి.దైవకృప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

లేఆఫ్ ప్రకటించడం అన్యాయం

జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు

బిక్కవోలు, ఫిబ్రవరి 23: బలభద్రపురం శివారు కానేడులో వున్న బ్లూక్రాఫ్ట్ ఆగ్రో యాజమాన్యం లేఆఫ్ ప్రకటించడం అన్యాయమని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. లేఆఫ్‌ను వ్యతిరేకిస్తూ ఎనిమిది రోజులుగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు చేపట్టిన రిలే నిరవధిక దీక్షా శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు చేపట్టిన దీక్షకు మద్దతు తెలుపుతున్నామన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీ-జనసేన అధికారంలోకి రావడం ఖాయమని, వచ్చిన 30 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. ఈయన వెంట రావాడ నాగు, ఇందల వీరబాబు, అరుణ్‌కుమార్, కిట్టబాబు, నూతంగి శ్రీను తదితరులున్నారు.

కర్రీ పాయింట్‌లో విజిలెన్స్ తనిఖీలు



స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అధికారులు ఓ కర్రీ పాయింట్‌లో తనిఖీలు చేసి వాణిజ్య అవసరాలకు వాడుతున్న 5 గృహ వినియోగ వంటగ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ కేఎస్ఎస్ వీ సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోరుకొండ రోడ్‌లో ఉన్న శ్రీలక్ష్మీ కర్రీ పాయింట్‌లో శుక్రవారం సోదాలు చేశారు. గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడుతున్నారని గుర్తించారు. కర్రీపాయింట్ యజమాని బలుసు ఆదినారాయణపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎస్ఐ జగన్నాథరెడ్డి,కానిస్టేబుళ్లు కిషోర్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కడియపులంకలో ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో మాట్లాడుతున్న కందుల దుర్గేష్

కడియం, ఫిబ్రవరి 23: కడియపులంక గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం పుల్లా రాజశేఖర్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, వైసీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. విచ్చేసారు. కిమ్స్ ఆస్పత్రి వైద్యులు సేవలందించారు. శిబిరంలో పలువురికి వైద్యపరీక్షలతో పాటు ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేసినట్టు సత్యదేవా నర్సరీ అధినేత పుల్లా అబ్బులు తెలిపారు. కార్యక్రమంలో వజ్రపు కోటేశ్వరరావు, పుల్లా చంటియ్య, ముద్రగడ జమీ, ఆదిమూలం సాయిబాబా, ముద్రగడ సుధ, నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు పలువురు రైతులు పాల్గొన్నారు.

కొత్తతుంగపాడులో ప్రజాపోరు యాత్ర

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 23: అవినీతి మచ్చలేకుండా దశాబ్ద కాలంగా సమర్థవంతమైన పరిపాలన అందిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వాలని పార్టీ రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి కోరారు. మండలంలోని కొత్తతుంగపాడు, శ్రీకృష్ణపట్నం గ్రామాల్లో శుక్రవారం ప్రజాపోరు యాత్రను నిర్వహించారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఇన్‌చార్జి ఏపీఆర్ చౌదరి, ఎం.రజనీ, అడబాల గణపతిరావు, దొడ్డా అర్జున్, బోయిడి దుర్గారావు, సత్యనారాయణ, దొడ్డా శ్రీను పాల్గొన్నారు.

జి.దొంతమూరులో అభివృద్ధి పనులకు శ్రీకారం

రంగంపేట, ఫిబ్రవరి 23: మండలంలోని జి.దొంతమూరులో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం శ్రీకారం చుట్టారు. గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనం, రజకుల కమ్యూనిటీ హాలును ఆయన ప్రారంభించారు. అలాగే కోటపాడులో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామ నాయకులు ఎమ్మెల్యేను, జడ్పీటీసీ పేపకాయల రాంబాబును సత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇశ్రాయేలు, గవరసాని రాజు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 23: రఘునాథపురంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని శ్రీరాంపురంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. రఘునాథపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వాసంశెట్టి పెదవెంకన్న, గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, బోయిడి సుబ్రహ్మణ్యం, జి.శ్రీను, పలివెల శ్రీను పాల్గొన్నారు.



శ్రీరాంపురంలో మంచినీటి బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజా

అనపర్తిలో 'వలంటీర్లకు వందనం'

అనపర్తి, ఫిబ్రవరి 23: వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తిలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఆయన విచ్చేసి వలంటీర్లను సన్మానించారు. రామవరానికి చెందిన మల్లిడి మౌనికాదేవికి సేవావజ్ర అవా ర్డును, మరో ఐదుగురికి సేవరత్న అవార్డులు, 449మందికి సేవా మిత్ర అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎస్ఎంఎం బాలకృష్ణారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, పడాల శ్రీనివాసరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు మల్లిడి విజయ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నేడు టీడీపీ-జనసేన తొలి జాబితా విడుదల

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితా శనివారం విడుదలయ్యే అవకాశం ఉంది. ఉదయం 11 గంటల తర్వాత జాబితాను టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించనున్నారు.అధికారికంగా ఇంకా అభ్యర్థులను ప్రకటించకపోవడంతో ఆశావహులతో పాటు పార్టీ కేడర్ కూడా ఒత్తిడికి గురవుతోంది. ఎన్నికలకు కొద్ది రోజులు మాత్రమే ఉండడం వల్ల అభ్యర్థుల ప్రకటనపై ఒత్తిడి పెరిగింది. తొలిజాబితాలో జిల్లా నుంచి టీడీపీ, జనసేన ఉమ్మడి జాబితాలో కొన్ని పేర్లు ఉండే అవకాశం ఉంది. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా, ఇప్పటికే టీడీపీ గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకట్రాజు, రాజమహేంద్రవరం సిటీ నుంచి ఆదిరెడ్డి వాసు, అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విషయంలో క్లారిటీగా ఉన్నట్టు సమాచారం.సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ ఇస్తామని గతంలో చంద్రబాబు ప్రకటించారు. అయితే జనసేనతో పొత్తు నేపథ్యంలో రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం సీట్లపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కొవ్వూరు, నిడదవోలు సీట్లకు అంతే డిమాండ్ ఉంది. తొలి జాబితా విడుదలతో అందరిలో టెన్షన్ మరింత పెరిగింది.



వివరాలు వెల్లడిస్తున్న డీఆర్వో నరసింహులు

రేపు 53 కేంద్రాల్లో గ్రూప్-2

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 53 కేంద్రాల్లో ఈ నెల 25న ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) నరసింహులు తెలిపారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ యాజమాన్యాలు, ముఖ్య పర్యవేక్షకులు, సమన్వయాధికారులు,పరిశీలకులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఏపీపీఎస్సీ అధికారులు కూడా హాజరయ్యారు. డీఆర్వో మాట్లాడుతూ గ్రూప్-2కి జిల్లాలో 18,501 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ఒంటిగంట వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు కచ్చితంగా ఉదయం 9 గంటలకే కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీటి సదుపాయం, నిరంతర విద్యుత్‌తోపాటు అత్యవసర మందులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు అనుమతించరని తెలిపారు. అభ్యర్థులు వారికి కేటాయించిన ప్రదేశంలో 15 నిమిషాల ముందే కూర్చోవాలన్నారు. ఉదయం 9గంటల నుంచి 10.15గంటల వరకూ హాల్‌టికెట్లు, గుర్తింపు కార్డుల పరిశీలన ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ శివనారాయణ రెడ్డి, సహాయ కార్యదర్శి కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంక్‌ను అమ్మేసిన పంచాయతీ కార్యదర్శి

దుద్దుకూరులో వార్డు సభ్యుల నిరసన

దేవరపల్లి, ఫిబ్రవరి 23: దుద్దుకూరు గ్రామ పంచాయతీ అవకతవకలపై అధికారులు చర్యలు తీసుకోవాలని దేవరపల్లి మండలం దుద్దుకూరు పంచాయతీ వార్డు సభ్యులు కే.రవికుమార్ మరో ఆరుగురు సభ్యులు శుక్రవారం ఆందోళన చేశారు. వార్డు సభ్యులు కే.రవికుమార్, నిమ్మగడ్డ హరిప్రసాద్, ముళ్ళపూడి శ్రీనివాస్, బలుసు ఇందిర, ఆరేపల్లి అమ్మన్న, మంచిలి వెంకటలక్ష్మి, మల్లిపూడి సుబ్బారావు మాట్లాడారు. పంచాయతీకి దాతలు ఇచ్చిన వాటర్‌ట్యాంక్‌ను పంచాయతీ తీర్మానంలో పెట్టకుండా ఇష్టానుసారంగా కార్యదర్శి అమ్మేశారని ఆరోపించారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం అయ్యాయని వెంటనే స్పందించి విచారణ చేపట్టాలన్నారు. ఈ అవకతవకలపై గతంలో స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కి ఫిర్యాదు చేశామన్నారు.కొవ్వూరు డివిజనల్ ప్రత్యేకాధికారి శుక్రవారం విచారణ చేపట్టడానికి వస్తున్నారని తెలియడంతో పంచాయతీ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఉన్నా ఎవరు రాలేదన్నారు. పంచాయతీ అక్రమాలపై అధికారులు స్పందించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు వివరణ ఇస్తూ పంచాయతీలో ఎటువంటి అవకతవకలు జరగలేదని వాటర్ ట్యాంక్ ఎప్పుడో పాతదని అది పనికిరాకపోవడంతో ఆ ట్యాంకును విక్రయించి ఆ సొమ్మును పంచాయతీకి చలానా రూపంలో జమ చేశామన్నారు.



రాజమహేంద్రవరం చుట్టూ రాజకీయ క్రీడ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తూర్పు ఎటో తీర్పు అటే.. రాజకీయ పార్టీల సెంటిమెంట్. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రాజమహేంద్రవరం సెంటిమెంట్‌గా ఉండేది. ఎన్నికల శంఖారావాలన్నీ రాజమహేంద్రవరం నుంచి ప్రారంభమయ్యేవి..ఇక్కడ సభలు సక్సెస్ అయిన పార్టీదే గెలుపు అనే నమ్మకం ఉండేది. జిల్లాల విభజన తర్వాత రాజమహేంద్రవరం కేంద్రంగా కొత్త తూర్పుగోదావరి ఏర్పడిన సంగతి తెలిసిందే. కొత్త జిల్లాల వారీ తొలిసారి సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. అయినా నాటి సెంటిమెంట్ మాత్రం మారలేదు.తూర్పుగోదావరి, ముఖ్యంగా రాజమహేంద్రవరం కేంద్రంగా నేటి రాజకీయం నడుస్తోంది.తూర్పున ఏం జరిగితే అదే రాష్ట్ర వ్యాప్తంగా అమలయ్యే పరిస్థితి ఉంది. దీనికి నిదర్శనమే టీడీపీ-జనసేన పొత్తు.. అంతే కాకుండా ప్రస్తుతం బీజేపీతో పొత్తు కుదిరినా రాజమహేంద్రవరం కీలకంగా మారవచ్చని విశ్లేషకుల అంచనా.

పొత్తు పొడించింది ఇక్కడే..

త్వరలో జరగనున్న ఎన్నికలతో రాజమహేంద్రవరానికి ఓ ప్రత్యేక సంబంధం ఉంది. తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును వైసీపీ ప్రభుత్వం తప్పుడు కేసుల్లో ఇరికించి 53 రోజుల పాటు సెంట్రల్ జైలులో పెట్టిన సంగతి తెలిసిందే. అప్పుడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ చంద్రబాబుతో ములాఖత్ అయిన తర్వాత సెంట్రల్ జైలు ఎదురుగా తెలుగుదేశం,జనసేన పొత్తును ప్రకటించారు. అది పెద్ద సంచలనం. అప్పటి వరకూ అసలు పొత్తు ఉంటుందా లేదా అనే ప్రశ్న అందరినీ తొలిచేసేది. ఆ ప్రకటన ఏపీ రాజకీయాలను చాలా ప్రభావితం చేసింది. ఇటు తెలుగుదేశం, జనసేన కేడర్‌లో ఉత్సాహం నింపింది. కానీ అధికార వైసీపీకి మాత్రం వెన్నులో వణుకుపుట్టింది. అప్పుడే రాజమహేంద్రవరం వేదికగా ఏపీ రాజకీయాలలో మార్పుకు నాంది పలికినట్టు అయింది. మహానాడు వేదికగా చంద్రబాబు నాడు సూపర్ సిక్స్ పథకాలు ప్రవేశపెట్టి రాజమహేంద్రవరం సెంటిమెంట్‌ను చాటితే దానిని కొనసాగిస్తూ పవన్ కల్యాణ్ చేసి పొత్తు ప్రకటన ఓ చరిత్ర అయింది. ఆ సెంటిమెంట్‌కు ప్రాణం పోస్తూ ఇటీవల చంద్రబాబు రా కదలిరా సభను నిర్వహించి సక్సెస్ చేశారు. ఇదిలా ఉండగా ఉభయగోదావరి జిల్లాల్లో అన్ని స్థానాలు కైవసం చేసుకునే విధంగా టీడీపీ-జనసేన ముందుకు వెళుతున్నాయి. ఈ పొత్తులో బీజేపీ కూడా కలవనుందనే ప్రచారం ఉంది. ఈ మూడు పార్టీలు కలిసి విజయకేతనం ఎగురవేస్తాయని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఈ ప్రాంతంమీద దృష్టి సారించాయి.

అధినేతల పర్యటనలు..

ఎన్నికల వేళ ఇప్పటికే టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఇటీవల రాజమహేంద్రవరం రూరల్‌లోని కాతేరులో రా పిలుస్తోంది రా పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సభకు భారీ స్పందన లభించడం టీడీపీ, జనసేన వర్గాల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఇటీవల రాజమహేంద్రవరంలో ఓ రోజు ఉండి రాజమహేంద్రవరం డివిజన్‌లోని రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ముఖనేతలతో సమీక్షించారు. తెలుగుదేశం, జనసేన అధినేతలు ఇప్పటికే రాజమహేంద్రవరం నుంచి ఎన్నికల సైరన్ మోగించగా, వైసీపీ అధినేత సీఎం జగన్ మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడలేదు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మాత్రం జిల్లాలో రచ్చబండ నిర్వహించి ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపు ఇచ్చారు.బీజేపీ, వామపక్ష నేతలు ప్రచారం చేసుకుంటున్నారు.

సీటు కోసం పోటాపోటీ

తెలుగుదేశం, జనసేన పార్టీల పొత్తు వల్ల ఉమ్మడి అభ్యర్థులెవరనేది చర్చనీయాంశమైంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంట్ స్థానం ఉన్నాయి. టీడీపీ, జనసేన ఎక్కడెక్కడ పోటీ చేస్తుందనేది అధికారికంగా ప్రకటించలేదు. అయితే రాజమహేంద్రవరం సిటీ, గోపాలపురం, అనపర్తి స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను ఇప్పటికే సూచన ప్రాయంగా ఖరారు చేసింది.జనసేన అధినేత పవన్ కల్యాణ్ గతంలో రాజానగరం నుంచి జనసేన పోటీ చేస్తుందని ప్రకటించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో ఆయన రాజమహేంద్రవరం రూరల్ నుంచి జనసేన పోటీ చేస్తుందని, కందుల దుర్గేష్‌ను గెలిపించాలని కూడా ప్రకటించారు. కానీ ఇక్కడ రాజానగరం నియోజకవర్గం ప్రస్తావన తీసుకు రాలేదు. ఎందుకురాలేదనేది చంద్రబాబు, పవన్ ఉమ్మడిగా సీట్లు ప్రకటించిన తర్వాతే తేలుతుంది. రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్‌లో కూడా టీడీపీ బలంగా ఉండడం వల్ల టీడీపీనే ఇక్కడ పోటీ చేస్తుందని స్థానిక నేతలు,టికెట్ ఆశించేవారు ప్రకటిస్తున్నారు.రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే,టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్లబుచ్చయ్య చౌదరి ధీమాగా ఉన్నారు. ఇదిలా ఉండగా ఒక వైపు గోరంట్ల, మరో వైపు దుర్గేష్ ఎవరి ప్రచారం వారు చేసుకుంటున్నారు.రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ ఇంకా ధీమాతోనే ఉన్నారు. రెండు పార్టీల అధి నేతలు సీట్ల కేటాయింపు చేసి అభ్యర్థులను ఖరారు చేసే వర కూ ఇక్కడ సస్పెన్స్ వీడేలా కనిపించడం లేదు.మిగిలిన నియోజకవర్గాల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులుగా పోటీపడుతున్నవారు అంతగా లేరు. అధిష్ఠానం ఎలా చెబితే అలా చేసే పరిస్థితులు ఉన్నాయి. నిడదవోలులో టీడీపీ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, సీనియర్ నేత కుందుల సత్య నారాయణ పోటీ పడుతున్నారు.ఈ స్థానంలో జనసేనకు కూడా కేటాయిస్తారనే ప్రచారం కూడా ఉంది. అదే జరిగితే టీడీపీ నేత ఒకరు జనసేన కండువా కప్పుకుని టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తారనే ప్రచారం ఉంది.రాజమహే ంద్రవరం సిటీలో టీడీపీ నేత ఆది రెడ్డి వాసు, జనసేన నేత అనుశ్రీ సత్యనారాయణ ఐక్యంగా పనిచేస్తుండడం,ఇక్కడ సీటు టీడీపీకేనని చెబుతుండడం గమనార్హం.గోపాలపురం, అనపర్తిలో అభ్యర్థులు నిర్ణయమైన ట్టు చెబుతున్నారు.గోపాలపురంలో వర్గాలు ఉన్నప్పటికీ అధిష్ఠానం వాటిని సరిచేసే ప్రయత్నాలు చేస్తోంది. కొవ్వూరు టీడీపీ అభ్యర్థి ఎవరనేది పెద్ద సమస్యగా మారింది. అక్కడ మాజీ మంత్రి జవహర్ టికెట్ ఆశిస్తున్నారు.కానీ అక్కడ ఓ ముఖ్యవర్గంతో ఆయనకు విబేధాలు సమస్యగా మారాయి.

- ఇంకనూ వీడని సీట్ల సస్పెన్స్
- పోటాపోటీగా అభ్యర్థులు
- పొత్తులతో మరింత ఆలస్యం
- పోటీపై అభ్యర్థుల్లో ఉత్కంఠ
- నేడు తొలి జాబితా విడుదల
- ఫ్యాన్‌కు ఉక్కబోత
- ఇంకనూ తేలని మూడు సీట్లు
- 4 సీట్లలో బదిలీలతో అసహనం
- టీడీపీలో పెరుగుతున్న చేరికలు

ఉమ్మడి ఎంపీ అభ్యర్థి ఎవరో?

రాజమహేంద్రవరం లోక్‌సభ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఎవరనేది చర్చనీయాంశమైంది. బీజేపీ కూడా కలిస్తే ఎక్కడ ఎవరు బరిలో దిగుతారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. రాజానగరం జనసేనకు కేటాయిస్తే, అక్కడి టిడిపి ఇన్‌చార్జి, బొడ్డు వెంకటరమణను ఎంపీగా బరిలో దింపుతారనే ప్రచా రమూ ఉంది. బీజేపీ కలిస్తే మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పోటీ చేస్తారనే ప్రచారం ఉంది. ఇలా రాజమహేంద్రవరం వేదికగా రాజకీయం నడుస్తోంది. శనివారం తొలి జాబితా విడుదలయ్యే అవకాశం ఉందని స్థానిక నాయకులు చెబుతున్నారు.

వైసీపీలో నాడు అక్కడ.. నేడు ఇక్కడ..

వైసీపీ జిల్లాలో నలుగురు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ప్రకటించింది.ఇంకా ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేల విషయంలో ఎందుకో జాప్యం చేస్తోంది. ఇప్పటికే ఖరారైన అభ్యర్థులు ప్రచారం ఆరంభించినా ఎదురీత తప్పడం లేదు. రాజమహేంద్రవరం సిటీలోనే భరత్‌కు వ్యతిరేకంగా ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి విషయం చర్చనీయాంశమవుతోంది. గతంలో వేరే ప్రాంతాల్లో గడపగడపకూ తిరిగిన అభ్యర్థులు ఇవాళ కొత్తగా మరో చోట గడపగడపకూ తిరవలసి వస్తుంది. జనం కూడా పెద్దగా రావడంలేదు. కొవ్వూరులో వైసీపీకి కృష్ణబాబు అల్లుడు, వైసీపీ ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌కృష్ణ పెద్ద. మంత్రి తానేటి వనిత గోపాలపురం మారడానికి, అక్కడ నుంచి తలారి వెంకట్రావు ఇక్కడకు రావడానికి వ్యూహం రాజీవ్ కృష్ణదే అని చెబుతుంటారు. కానీ ఇటీవల రాజీవ్ కృష్ణను నర్సాపురం పరిశీలకుడిగా పంపించే ప్రయత్నం జరిగిందనే సమాచారంతో కొవ్వూరు వైసీపీలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఓ ముఖ్యవర్గం పార్టీ కార్యకలాపాల జోలికి వెళ్లకుండా ఆగిపోయింది. తర్వాత అధిష్ఠానం దిగి వచ్చి, రాజీవ్‌కృష్ణకు నచ్చచెప్పింది. కొవ్వూరుతో పాటు రాజమహేంద్రవరం లోక్ సభ స్థానంలో కూడా ఆయన సహకారం అవసరమని చెప్పి నట్టు సమాచారం. రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి, ఎంపీ మార్గాని భరత్‌తో ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రిషా కోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిళారెడ్డి వర్గాలు దూరంగా ఉంటున్నాయి.. ఇదిలా ఉండగా ఇటీవల వైసీపీ నాయకులు టీడీపీ వైపు చూస్తున్నారు. ఇటీవల అనపర్తి, గోకవరం మండలాల్లో టీడీ పీలో చేరికలే ఇందుకు నిదర్శనం.



ఈవీఎం గొడౌన్ వద్ద కలెక్టర్ మాధవీలత

భద్రంగా ఈవీఎంలు : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 23: రాజమహేంద్రవరంలో ఎఫ్‌సీఐ గొడౌన్స్‌లో ఈవీఎంలు భద్రంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి కే.మాధవీలత తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శుక్రవారం గొడౌన్‌ను తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకం మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా గొడౌన్ వద్ద ఉన్న సీసీ కెమెరాలు, భద్రత చర్యలను పరిశీలించామన్నారు.ఈ గొడౌన్ వద్ద పోలీసు భద్రత సిబ్బంది మూడు షిఫ్టుల విధానంలో పనిచేస్తున్నారని చెప్పారు. కలెక్టర్ వెంట ఆర్‌డీవో ఎ.చైత్రవర్షిణి, ఎస్‌డీసీఆర్ కృష్ణ నాయక్, డీటీ ఎం.పవన్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు నలబాటి రమేష్ (కాంగ్రెస్), వై.రాజశేఖర్ (వైసీపీ), రాయుడు గణేష్ ,సిహెచ్ శ్రీనివాసరావు (టీడీపీ), బి.రామచంద్రరావు (బీజేపీ) పాల్గొన్నారు.



అబ్బో.. కంద దుంప..

పెరవలి, ఫిబ్రవరి 23 : ఈ కంద దుంపను చూస్తే అమ్మో ఎంత ఉందో అనక మానరు.. ఎందుకంటే ఒకటా రెండా ఏకంగా ఒకటే దుంప 10 కేజీలు ఉంది. సాధారణంగా కంద దుంప బరువు కేజీ నుంచి ఐదు కేజీలు వరకు ఉంటుంది. కానీ తీపర్రుకు చెందిన కరుటూరి నారాయణరావు పొలంలో కంద దుంప సుమారు 10 కేజీల వరకు తయారైంది. కొబ్బరిలో అంతర పంటగా కందను సాగు చేస్తున్నారు. చాలా కాలంగా కొన్ని దుంపలు తవ్వకుండా వదిలివేశారు. అయితే రెండేళ్ల తరువాత గురువారం కందను తవ్వగా పెద్ద దుంప బయటపడింది. దీనిని అందరూ ఆశ్చర్యంగా చూశారు. రెండేళ్ల పాటు వదిలివేయడంతో దుంప బాగా ఊరినట్టు రైతులు చెబుతున్నారు.



నందమూరులో పాల సేకరణ యంత్రం పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

వేగంగా పాల సేకరణ : కలెక్టర్

కొవ్వూరు, ఫిబ్రవరి 23 : అమూల్ పాల సేకరణ కేంద్రాల ద్వారా పాడి రైతుల నుంచి పాలసేకరణ ప్రక్రియ వేగవంతం చేయడం జరుగుతుందని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. కొవ్వూరు మండలం నందమూరు గ్రామంలో అంబికా గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాల సేకరణ కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ కె.మాధవీలత, వేములూరులో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు జగనన్న పాలవెల్లువ పాల సేకరణ కేంద్రాలను ప్రారంభించారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ పాల సేకరణ కేంద్రాల ద్వారా దళారుల ప్రమేయం లేకుండా తగిన ధర చెల్లించడం జరుగుతుందన్నారు. ఇప్పటికి కొవ్వూరు డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 44 పాల సేకరణ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, శుక్రవారం మరో 42 కేంద్రాలు ప్రారంభించామన్నారు. ప్రస్తుత్తం 5 వేల లీటర్ల పాలను సేకరిస్తున్నామని, క్రొత్తగా ఏర్పాటుచేసిన 42 కేంద్రాలలో ఒక్కొక్క కేంద్రం ద్వారా రోజుకి 160 లీటర్ల పాల సేకరించాలని ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతం చిట్యాల కేంద్రంలో 5 వేల లీటర్ల పాలను శీతలీకరణ చేస్తున్నట్టు తెలిపారు. త్వరలో కాపవరం గ్రామంలో బల్క్ మిల్క్ యూనిట్ అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో మార్చి 1వ తేదీ నుంచి బూపాలపట్నం, జంబూపట్నంలలో 2 బల్క్‌మిల్క్ యూనిట్లు అందుబాటులోకి తెస్తామన్నారు. రెండు యూనిట్స్ పరిధిలోని 9 మండలాల్లో 91 కేంద్రాల ద్వారా పాల సేకరణ ప్రారంభించామన్నారు. రాజానగరం మండలం భూపాలపట్నం బల్క్‌మిల్క్ యూనిట్ పరిధిలో 46 పాల సేకరణ కేంద్రాలు, కోరుకొండ మండలం జంభుపట్నం బల్క్‌మిల్క్ యూనిట్ పరిధిలో 45 పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా. ఎస్‌జీటీ సత్య గోవిందు, ఎంపీడీవో కె.సుశీల,బండి పట్టాభి రామారావు పాల్గొన్నారు.



20 రోజుల కిందట ట్రాప్ కెమెరాకు చిక్కిన పెద్ద పులి



కరగపాడు రిజర్వు ఫారెస్ట్‌లో పులి దాడిలో చనిపోయిన మేక

- మళ్లీ పెద్ద పులి సంచారం
- 20 రోజుల్లో రెండో సారి రాక
- బిక్కుబిక్కుమంటూ జనం
- మూడు మేకలు హతం
- ఒక్కరాత్రిలో 30 కి.మీ ప్రయాణం
- ప్రస్తుతం కరగపాడు ఫారెస్ట్‌కు చేరిక

గోపాలపురం, ఫిబ్రవరి 23 : పెద్ద పులులు జనారణ్యంలోకి వచ్చేస్తున్నాయి... దారి తప్పుతున్నాయో.. వేరే దారిలేక వస్తున్నాయో తెలియదు కానీ.. మొత్తం జనం చుట్టూ తిరుగుతున్నాయి.. పెద్దపులి పేరు చెబితేనే ముచ్చెమటలు పడతాయి.. ఎందుకంటే ఎటునుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయం భయంగా ఉంటారు.ప్రస్తుతం పాపికొండల అభయారణ్యం నుంచి దారి తప్పి వచ్చిన పెద్దపులి మెట్ట ప్రాంతంలో సంచరిస్తుంది. పగలు దట్టమైన పొదల్లో దాగి ఉండి రాత్రి సమయాల్లో తన ప్రయాణాన్ని సాగిస్తుందని అటవీశాఖాధికారులు చెబుతున్నారు. ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి ఊరుకున్న అధికారులు ఆ పులిని పట్టుకునే సాహసం మాత్రం చేయడం లేదు ఎందుకో..

20 రోజుల కిందట వచ్చి వెళ్లింది..

గత 20 రోజుల కిందట పాపికొండలు అభయారణ్యంలోకి బయలుదేరిన పులి ఏలూరు జిల్లా కన్నాపురం, కొయ్యలగూడెం, నల్లజర్ల మండలాల మీదు గా ద్వారకా తిరుమల అటవీప్రాంతంలోకి వెళ్లింది.ఉన్నట్టుండి నల్లజర్ల నుంచి దేవరపల్లి మండల యాదవోలు పొలాల్లో ప్రత్యక్షమైంది.అక్కడ నుంచి మాతంగమ్మ మెట్ట చేరుకుని కరగపాడు రిజర్వ్ ఫారెస్ట్‌లో రెండు రోజులు మకాం వేసి అక్కడే ఒక రైతు పెంచుకుంటున్న పందిపై దాడి చేసి చంపింది.పులి పాదముద్రలు గమనించిన ప్రజలు ఎప్పటికప్పుడు అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన అటవీశాఖాధికారులు ఆ పాదముద్రలు పులివేనని నిర్ధారణ చేసి ఆ పరిసర ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.ఒంటరిగా పొలాలకు వెళ్లవద్దంటూ హెచ్చరికలు జారీ చేశా రు. అయితే మాతంగమ్మ మెట్ట ప్రాంతాల నుంచి పులి కదలికలు గమనించేందుకు ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసి న ట్రాప్ కెమెరాలకు చిక్కింది. దీంతో భారీ ఆకారంలో భయంకరంగా పెద్ద పులి ఉన్నట్టు అధికారులు గమనిం చారు. అనంతరం ఆ పులి కన్నాపురం అటవీప్రాతం నుంచి పాపికొండల అభయారణ్యంలోకి వెళ్లిపోయిందని అధికారులు నిర్ధారించారు.దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.పులి లేదని ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు.

అమ్మో మళ్లీ వచ్చేసింది..

అభయారణ్యం ఖాళీ అయ్యిందో లేక జనారణ్యమే నచ్చిందో కానీ మళ్లీ పెద్ద పులి వచ్చేసింది.. సుమారు వారం రోజుల పాటు అడవుల్లోనే ఉన్న పెద్ద పులి మళ్లీ గ్రామసంచారం మొదలుపెట్టింది. ఎటు నుంచి వచ్చిందో తెలియదుకానీ దేవరపల్లి గ్రామశివారులో ఉన్న బంధపురం, పోలవరం కుడికాల్వ గట్టుపై పులిపాదముద్రలు దర్శనమిచ్చాయి. పులి పాదముద్రలు గుర్తించిన ఆ ప్రాంత రైతులు ఉలిక్కిపడ్డారు. దీంతో అటవీశాఖాధికారులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వచ్చిన అటవీఅధికారులు పులిపాదముద్రలేనని నిర్ధారణ చేశారు. అత్యవసరం అయితే తప్ప సాయంత్రం సమయంలో బయటకు రావద్దని టాంటాం వేయించారు.

మూడు మేకలు హతం..

నిన్నమొన్నటి వరకు గోపాలపురం మండల పరిసర ప్రాంతంలోని చెరుకుమిల్లి, పెద్దాపురం గ్రామాల మధ్య సంచరించిన పెద్దపులి బుధవారం సాయంత్రానికి తాళ్ళపూడి మండలం మలగపల్లి గ్రామంలో ప్రవేశించింది. గురువారం తెల్లవారే సరికి తిరుగుముఖం పట్టిన పెద్దపులి గోపాలపురం మండలం కోమటిగుంట గ్రామ శివారులో ఉన్న మాతంగమ్మమెట్ట చేరుకుంది. అక్కడ నుంచి 30 కిలోమీటర్లు మేర ప్రయాణించి కరగపాడు రిజర్వ్‌ఫారెస్ట్‌లో ప్రవేశించింది. గురువారం ఉదయం అటవీ ప్రాంతంలో మేకల మందను మేపుతున్న బుచ్చయ్యపాలెం గ్రామానికి బొమ్మిన బాబూరావు రెండు మేకలను, జక్కువెంకన్నకు చెందిన ఒక మేకపై పెద్దపులి దాడి చేసింది. మూడు మేకలు మృతి చెందాయి. దాడి చేసి చంపిన మూడు మేకల్లో ఒక మేకను పెద్దపులి ఎత్తుకు వెళ్లినట్టు అధికారులు చెబుతున్నారు. కరగపాడు, బుచ్చయ్యపాలెం, ఎల్‌అండ్‌టీపేట, సాగిపాడు, దొండపూడి తదితర గ్రామాల పరిధిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

అధికారులు చేసిందేమిటి?

పాదముద్రలకే పరిమితం అయిన అటవీ అధికారులు. పాపికొండల అభయారణ్యం నుంచి రెండుసార్లు గ్రామాల్లోని మూడు నియోజకవర్గాల పరిధిలో గ్రామ సంచారం చేసిన పెద్దపులిని పట్టుకోవడంలో అటవీ అధికారులు విఫలమయ్యారని చెప్పాలి. ఆయా గ్రామాల శివారులో పంట పొలాల్లో ఉన్న పాదముద్రలను గుర్తించిన రైతులు ఇస్తున్న సమాచారం మేరకు ఆ పాదముద్రల వెంబడిస్తున్నారే తప్ప బోనులు ఏర్పాటు చేసి ఆ పులిని పట్టుకునే ప్రయత్నం మాత్రం నేటి వరకూ చేయలేదు.దీంతో ఏ ప్రాంతంలో పులి ప్రత్యక్షమవుతుందోనంటూ ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఇప్పటికైన అటవీఅధికారులు పులిని పట్టుకుని పాపికొండల అభయారణ్యంలో వదిలిపెట్టి భయాందోళన నివృత్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

9న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

కొవ్వూరు, ఫిబ్రవరి 23: కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో ఇన్సూరెన్సు కేసులు, మోటారు యాక్సిడెంటు కేసులకు సంబంధించి న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు రాజీ అయ్యే విధంగా న్యాయవాదులు సహకరించాలన్నారు. శాశ్వత లోక్ అదాలత్‌లో మధ్యవర్తిత్వం ద్వారా కేసులు రాజీ చేసుకోవచ్చునని శ్రీనివాసరావు చెప్పారు. వాహన ప్రమాద బీమా కేసులు ఎక్కువ రాజీ చేయడానికి ప్రయత్నించాలన్నారు. కేసులు రాజీ చేసుకోవడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు.

మాలలకు జనసేన సీటు కేటాయించాలి

మాల మహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటు శ్యాం రవిప్రకాష్

కొవ్వూరు, ఫిబ్రవరి 23: రాజమహేంద్రవరం పార్లమెంటు పరిధిలో కొవ్వూరు, గోపాలపురం రిజర్వుడు నియోజకవర్గాల్లో ఒకటి జనసేన తరపున మాల సామాజికవర్గానికి కేటాయించాలని మాల మహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటు బొంతా శ్యాం రవిప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కొవ్వూరులో పాత్రికేయులతో మాట్లాడుతూ జనసేన అధ్యక్షుడు మొట్టమొదటిగా దివంగత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య గృహాన్ని సందర్శించి పర్యాటక కేంద్రంగా గుర్తింపు తీసుకురావాలనే ఆలోచనతో రూ.1 కోటి విరాళం ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేశారు. కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో ఒకటి మాలలకు కేటాయించి సముచిత స్థానం కల్పిస్తే రాష్ట్ర వ్యాప్తంగా పవన్‌కల్యాణ్‌కు మద్దతు వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో దళిత వర్గాలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని వాటిని అరికట్టడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు పవన్‌కళ్యాణ్‌కు పడాలంటే మాలలకు తగిన ప్రాధాన్యం కల్పించాలన్నారు.

నిమ్మాడ తరలిన వెలమ సంఘ నాయకులు



కొవ్వూరు, ఫిబ్రవరి 23: కింజరపు ఎర్రన్నాయుడు జయంతి కార్యక్రమంలో కొవ్వూరుకు చెందిన వెలమ సంఘ నాయకులు పాల్గొన్నారు. శుక్రవారం కొవ్వూరు నుంచి శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో జరుగుతున్న ఎర్రన్నాయుడు జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సమక్షంలో ఎర్రన్నాయుడు చిత్రపటానికి వెలమ సంఘం నాయకులు బర్ల శ్రీనివాస్, బొబ్బిలి పేర్రాజు, మాదిరెడ్డి సతీష్, బొబ్బిలి శివ, బోజంకి కృష్ణారావు పూలమాలలతో నివాళులర్పించారు.

తాడిమళ్లలో 'పాల వెల్లువ'

నిడదవోలు, ఫిబ్రవరి 23: పాడి రైతులకు మంచి ధర అందించే ఉద్దేశ్యంతో సీఎం జగన్ పాలవెల్లువ కార్యక్రమానికి నాంది పలికారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. శుక్రవారం నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామంలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో మహిళా పాడిరైతుల సహకారంతో 32 పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశామని, వీటి ద్వారా పాడి రైతుల ఖాతాలకు పది రోజులకు ఒక్కసారి నేరుగా వారి డబ్బు జమ అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని దమ్మెన్ను గ్రామంలో పాలవెల్లువ పథకాన్ని జడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య ప్రారంభించారు. పాలంగిలో ఎంపీడీవో నవీన్‌కుమార్, సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, ఈవోపీఆర్డీ జేడీవీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎండీ హసన్‌జాని పాల్గొన్నారు. పలు గ్రామాల్లో ఈ పథకాన్ని ప్రారంభించి రైతుల నుంచి పాలను సేకరించారు.

గ్రూప్-2 పరీక్షా కేంద్రాల పరిశీలన



కరిబండి డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

తాళ్లపూడి, ఫిబ్రవరి 23: ఈ నెల 25న గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు మండలంలో ఎంపిక చేసిన మూడు పరీక్షా కేంద్రాలను తహశీల్దార్ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. తాళ్లపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కరిబండి డిగ్రీ కళాశాల, వేగేశ్వరపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు కేటాయించగా 720 మంది పరీక్షలకు హాజరవ్వనున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో మంచినీరు, లైటింగ్, ప్రత్యేక హెల్ప్‌డెస్క్, అభ్యర్థుల సెల్‌ఫోన్లను భద్రపరిచే కౌంటరు అన్నీ సక్రమంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 25న పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, కరిబండి త్రినాథస్వామి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలంగిలో 'ఆరోగ్య సురక్ష'



మందులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 23: జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి చెప్పారు. మండలంలోని పాలంగి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పేదలకు ఉన్నత ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం రోగులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య, సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, నాయకులు పాలాటి శరత్‌బాబు, బొక్కా శివకుమార్, డాక్టర్లు ఆర్ఎస్ ప్రసాద్, ఉషాదేవి, సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ కేడీఎల్ కుమారి, పంచాయతీ కార్యదర్శి ఎండీ హసన్‌జాని పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ హరిచందన

దేవరపల్లి, ఫిబ్రవరి 23: మార్చి 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యాదవోలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హరిచందన అన్నారు. మండలంలోని యర్నగూడెం పీహెచ్‌సీ వద్ద ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియోచుక్కలు వేయాలన్నారు. పోలియో రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో దూరంగా నిర్వహించే వలస కుటుంబాలను గుర్తించి వారి పిల్లలకు టీకాలు అందించేందుకు మొబైల్‌టీమ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పీహెచ్‌సీ పరిధిలో 3666మంది చిన్నారులున్నారని, 18 బూత్‌ల ద్వారా 86మంది వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశాసిబ్బంది సేవలందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, సీహెచ్‌వో సంజీవ్, హెచ్‌వీ పద్మకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి మాతకు మహానీరాజనం

కొవ్వూరు, ఫిబ్రవరి 23: అఖండ గౌతమీ గోదావరిమాతకు మహా నీరాజనం అందజేశారు. శుక్రవారం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలో గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో మాఘ పౌర్ణమి సందర్భంగా 221వ మాసోత్సవ మహా నీరాజనం నిర్వహించారు. గోదావరిమాతకు పూజలు చేసి, వివిధ రకాల హారతులు అందించారు. మహిళలు నేతి దీపాలను గోదావరిలో వదిలారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే ప్రకృతి రావణ బ్రహ్మ శివాలయంలో అన్నపూర్ణమ్మ సమేత మల్లికార్జునస్వామి సన్నిధిలో శ్రీచక్రానికి మహిళలు కుంకుమ పూజలు చేశారు.

తాగునీటికి కటకట

- ప్రక్కిలంకలో వరుసగా కాలిపోతున్న మోటార్లు
- ముందుచూపు లేని అధికారులు.. స్పందించని జిల్లా పరిషత్
- తాళ్లపూడి మండలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు

తాళ్లపూడి, ఫిబ్రవరి 23: మండలంలోని ప్రక్కిలంకలో ఏర్పాటు చేసిన సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా కేంద్రంలో మూడు రోజులుగా మోటార్లు కాలిపోవడంతో పలు గ్రామాల్లో ప్రజలు తాగునీటికి కటకటలాడుతున్నారు. శుద్ధి చేసిన గోదావరి నీటి పంపిణీలో ఒకప్పుడు మిగతా మండలాలకు తాళ్లపూడి మార్గదర్శి కాగా నేడు నీటి పంపిణీకి ఏ రోజు ఆటంకం కలుగుతుందో తెలియని దుస్థితి ఏర్పడింది. మండలంలో దాదాపుగా అన్ని గ్రామాల్లో తాగునీటి అవసరాలకు ప్రక్కిలంక నుంచి సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకం ద్వారా నిత్యం శుద్ధి చేసిన గోదావరి జలాలను పంపిణీ చేస్తున్నారు. ఈ పథకాన్ని ఓ కాంట్రాక్టర్ నిర్వహిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం రెండు మోటార్లు కాలిపోవడంతో వాటిని బాగుచేయించడానికి ఇచ్చారు. మిగిలిన ఒక్క మోటారుతోనే తాగునీరు సరఫరా చేస్తుండగా అదికాస్తా బుధవారం సాయంత్ర మొరాయించింది. మోటారును మరమ్మతు చేయించడానికి కాం ట్రాక్టరు, అధికారులు అప్పటికప్పుడు పరుగులు తీసారు. కానీ శుక్రవారం సాయంత్రానికి కూడా రిపేరు కాలేదు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు చెందిన సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకం నిర్వహణ కాంట్రాక్టర్‌దే అయినప్పటికీ మోటార్లు పాడైతే బాగు చేయించడం తప్ప కొత్త మోటార్లు,



ప్రక్కిలంకలోని సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకం

అదనపు మో టార్లు జిల్లా పరిషత్ ద్వారా మంజూరు అవ్వాలని అధికారులు చెబుతున్నారు. గత నెలలోనే కొత్త మోటార్ల అవసరాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు ఏఈ సూర్యహన్ తెలిపారు. తాగునీటి మోటార్ల సమస్య తన దృష్టికి రాలేదని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఈ విషయాన్ని తనకు తెలిపితే ఇటీవల జరిగిన సమావేశంలో ప్రస్తావించడానికి అవకాశం కలిగేదని జడ్పీ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ అన్నారు. అయితే త్వరగా మోటార్ల సమస్యను పరిష్కరించి తాగునీరు అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ- జనసేన సభను జయప్రదం చేయండి

- మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

నిడదవోలు, ఫిబ్రవరి 23: తాడేపల్లిగూడెంలోని ప్రత్తిపాడులో ఈ నెల 28న జరిగే టీడీపీ- జనసేన బహిరంగ సభను రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం సమీపంలో టీడీపీ- జనసేన బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడుతూ ఈ నెల 28న జరిగే సభకు రెండు పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు హాజరవుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఈ సభ ద్వారా ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. సభా స్థలి ఏర్పాట్ల



ప్రత్తిపాడులో సభావేదికను పరిశీలిస్తున్న టీవీ రామారావు



ప్రత్తిపాడులో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బూరుగుపల్లి శేషారావు

పరిశీలన కార్యక్రమంలో టీడీపీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొవ్వూరు: తాడేపల్లిగూడెం నియోజకవర్గం ప్రత్తిపాడులోని ఆటోనగర్‌లో జరగనున్న టీడీపీ-జనసేన బహిరంగ సభా ప్రాంగణాన్ని కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు పరిశీలించారు. శుక్రవారం జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్‌లతో కలిపి సభా ప్రాంగణాన్ని, వేదికను పరిశీలించారు. బహిరంగ సభకు కొవ్వూరు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలన్నారు.

టీడీపీలోనే రజకులకు రాజకీయ ప్రాధాన్యం

- రజక భరోసా బాట ఆత్మీయ సభలో ఎమ్మెల్సీ రామారావు

బిక్కవోలు, ఫిబ్రవరి 23: రజకులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన ఘనత టీడీపీదేనని ఎమ్మెల్సీ, టీడీపీ ప్రధాన కార్యదర్శి దువ్వారపు రామారావు అన్నారు. బిక్కవోలులో శుక్రవారం రజక చైతన్య సేవాసంస్థ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు అధ్యక్షతన రజక భరోసా బాట ఆత్మీయ సభ జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా ఆయనతో పాటు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ రజకుల సంక్షేమానికి ఎన్నో విధాలుగా టీడీపీ కృషి చేసిందని, ఎస్సీ జాబితాలో చేర్చేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపిందని, అధ్యయన కమిటీ వేసిందని, అలాగే దోబీఘాట్‌లు, ఉచిత విద్యుత్, ఆదరణ ద్వారా పనిముట్లు అందజేసిందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ఓట్లేసి, రామకృష్ణారెడ్డిని గెలిపించాలని రజకులకు పిలుపు నిచ్చారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రజకులకు చట్ట సభల్లో రాజకీయ ప్రాధాన్యం కల్పించింది టీడీపీయేనని, రజక మహిళలపై జరుగుతున్న



ఎమ్మెల్సీ రామారావును సత్కరిస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అత్యాచారాలను అరికట్టడానికి బీసీ రక్షణ చట్టాన్ని మానిఫెస్టోలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. రజకులకు శాసన సభలో, టీటీడీ పాలక మండలిలో ప్రవేశం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్సీ రామారావును రామకృష్ణారెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రజక నేతలు రామకృష్ణ, వెంకటరమణయ్య, దేశం నేతలు పాలచర్ల శివప్రసాదచౌదరి, గొర్రెల త్రిమూర్తులు, రాయుడు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

యువరైతు మృతికి మోదీ ప్రభుత్వానిదే బాధ్యత



రాజమహేంద్రవరంలో నిరసన ప్రదర్శన చేస్తున్న కార్మిక సంఘాలు

- రాజమహేంద్రవరంలో కార్మిక సంఘాల నేతల నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 23: న్యాయమైన హక్కుల కోసం ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేస్తున్న పోరాటంపై మోదీ ప్రభుత్వం దమనకాండను సాగించడంతో యువ రైతు మృతిచెందాడని, దీనికి మోదీ ప్రభుత్వానిదే బాధ్యత అని పలు కార్మిక సంఘాలు, రైతు, ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీల నాయకులు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం శ్యామలాసెంటర్‌లో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఏపీ రైతు సంఘం, ప్రజాసంఘాలు, సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ పార్టీల ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె. రాంబాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతు ఉద్యమంపై మోదీ ప్రభుత్వం దాడిని అందరూ ఖండించాలని, రైతాంగాన్ని కార్పొరేట్లకు బానిసలుగా చేసే బీజేపీని చిత్తుగా ఓడించాలన్నారు. మొదటి దశ రైతు ఉద్యమం సందర్భంగా మోదీ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం వల్లే రెండవ దఫా రైతు ఉద్యమం ప్రారంభమైందని వివరించారు. యువరైతు మృతిపై న్యాయవిచారణ జరిపించాలని, రైతులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వి. కొండలరావు, సీపీఐ ఎంఎల్ నగర కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, నాయకులు పవన్, టీఎస్ ప్రకాష్, ఎస్ఎస్ మూర్తి, నల్ల రామారావు, సావిత్రి, భానుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దుద్దుకూరులో సూపర్-6 శంఖారావం



శంఖారావం కార్యక్రమంలో మద్దిపాటి వెంకట్రాజు, టీడీపీ నాయకులు

దేవరపల్లి, ఫిబ్రవరి 23: ఇసుక దొంగలు కొవ్వూరు నుంచి గోపాలపురం నియోజకవర్గంలో చొరబడ్డారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు విమర్శించారు. మండలంలోని దుద్దుకూరులో సూపర్-6 శంఖారావం కార్యక్రమం శుక్రవారం సాయంత్రం జరిగింది. ఇంటింటికీ ప్రతులు పంచుతూ వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. స్థానిక అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక, మైనింగ్ మాఫియా రాజ్యమేలుతోందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక మాఫియాను, వారు దోచుకున్న సొమ్మును వడ్డీతో సహా కక్కిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆండ్రూ అనీల్, సుబ్బారావు, హరికృష్ణ, రాంబాబు, కంటిపూడి నరసింహ, తాతారావు, నందిన గిరిబాబు, కరుటూరి శ్రీరామమూర్తి, కాకర్ల సృజన పాల్గొన్నారు.

వైభవంగా అనంత పద్మనాభుడి గ్రామోత్సవం

కోరుకొండ, ఫిబ్రవరి 23: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దివ్య అధ్యయనోత్సవాలు 4వ రోజు శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం అధ్యా పక స్వాములు ద్రవిడ వేదాన్ని పారాయణం చేస్తున్నారు. సాయత్రం శ్రీ భూ సమేత అనంత పద్మనాభ స్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మంగవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణలతో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. అంతకుముందు ప్రత్యేక సేవా కాలం నిర్వహించారు. దిగువ దేవస్థానం వద్ద అనువంశక ధర్మకర్తలు పరాసర లక్ష్మీనరసింహ భట్టర్, పరాసర రంగరాజభట్టర్, రఘునాద భట్టర్, పెద్దింటి, పెరవళి, పెదపాటి అనువంశక అర్చక స్వాములు, గ్రామస్థులు పాల్గొన్నారు.

లారీలో రూ.9 లక్షల గంజాయి

ముగ్గురు నిందితుల అరెస్ట్..23.5 కిలోల సరుకు స్వాధీనం



కేసు వివరాల వెల్లడిస్తున్న పోలీసులు

రాజానగరం, ఫిబ్రవరి 23: ప్రయాణికులు ముసుగులో లారీలో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు నిందితులు మార్గమధ్యలో రాజానగరం పోలీసులకు చిక్కారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాతీయ రహదారిపై తూర్పుగోనగూడెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో లారీలో గంజాయి తరలిస్తున్నట్టు ముందుగా అందిన సమాచారం మేరకు నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, సీఐ కె.కాశీవిశ్వనాథ్ పర్యవేక్షణలో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బీహార్‌కు చెందిన మహమ్మద్ మహర్బాజ్ అలం, కేరళకు చెందిన వడకల్ వలపిన్ రాజేష్‌కుమార్, ఏలూరు జిల్లా చేబ్రోలు గ్రామానికి చెందిన తాకాసి శివ అలియాస్ శివాజీ నర్సీపట్నం ఏజెన్సీ ప్రాంతం నుంచి 23.5 కిలోల గంజాయిని ప్రయాణికులు మాదిరిగా లారీ ఎక్కి హైదరాబాదుకు తరలిస్తుండగా మార్గమధ్యలో తూర్పుగోనగూడెం వద్ద పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్టు చేశామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.9 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ మనోహర్ కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నల్లజర్ల, ఫిబ్రవరి 23: నల్లజర్ల మండలం అచ్చన్నపాలెం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన గోగులమూడి అచ్చయమ్మ(51)అక్కడిక్కడే మృతి చెందినట్టు నల్లజర్ల పోలీసులు తెలిపారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న అచ్చయమ్మను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు.

లేఆఫ్ ప్రకటించడం అన్యాయం

జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు

బిక్కవోలు, ఫిబ్రవరి 23: బలభద్రపురం శివారు కానేడులో వున్న బ్లూక్రాఫ్ట్ ఆగ్రో యాజమాన్యం లేఆఫ్ ప్రకటించడం అన్యాయమని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. లేఆఫ్‌ను వ్యతిరేకిస్తూ ఎనిమిది రోజులుగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు చేపట్టిన రిలే నిరవధిక దీక్షా శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు చేపట్టిన దీక్షకు మద్దతు తెలుపుతున్నామన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీ-జనసేన అధికారంలోకి రావడం ఖాయమని, వచ్చిన 30 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. ఈయన వెంట రావాడ నాగు, ఇందల వీరబాబు, అరుణ్‌కుమార్, కిట్టబాబు, నూతంగి శ్రీను తదితరులున్నారు.

కర్రీ పాయింట్‌లో విజిలెన్స్ తనిఖీలు



స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అధికారులు ఓ కర్రీ పాయింట్‌లో తనిఖీలు చేసి వాణిజ్య అవసరాలకు వాడుతున్న 5 గృహ వినియోగ వంటగ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోరుకొండ రోడ్‌లో ఉన్న శ్రీలక్ష్మీ కర్రీ పాయింట్‌లో శుక్రవారం సోదాలు చేశారు. గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడుతున్నారని గుర్తించారు. కర్రీపాయింట్ యజమాని బలుసు ఆదినారాయణపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎస్ఐ జగన్నాథరెడ్డి,కానిస్టేబుళ్లు కిషోర్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కడియపులంకలో ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో మాట్లాడుతున్న కందుల దుర్గేష్

కడియం, ఫిబ్రవరి 23: కడియపులంక గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం పుల్లా రాజశేఖర్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, వైసీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. విచ్చేసారు. కిమ్స్ ఆస్పత్రి వైద్యులు సేవలందించారు. శిబిరంలో పలువురికి వైద్యపరీక్షలతో పాటు ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేసినట్టు సత్యదేవా నర్సరీ అధినేత పుల్లా అబ్బులు తెలిపారు. కార్యక్రమంలో వజ్రపు కోటేశ్వరరావు, పుల్లా చంటియ్య, ముద్రగడ జమీ, ఆదిమూలం సాయిబాబా, ముద్రగడ సుధ, నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు పలువురు రైతులు పాల్గొన్నారు.

కొత్తతుంగపాడులో ప్రజాపోరు యాత్ర

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 23: అవినీతి మచ్చలేకుండా దశాబ్ద కాలంగా సమర్థవంతమైన పరిపాలన అందిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వాలని పార్టీ రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి కోరారు. మండలంలోని కొత్తతుంగపాడు, శ్రీకృష్ణపట్నం గ్రామాల్లో శుక్రవారం ప్రజాపోరు యాత్రను నిర్వహించారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఇన్‌చార్జి ఏపీఆర్ చౌదరి, ఎం.రజనీ, అడబాల గణపతిరావు, దొడ్డా అర్జున్, బోయిడి దుర్గారావు, సత్యనారాయణ, దొడ్డా శ్రీను పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



శ్రీరాంపురంలో మంచినీటి బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజా

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 23: రఘునాథపురంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని శ్రీరాంపురంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. రఘునాథపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వాసంశెట్టి పెదవెంకన్న, గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, బోయిడి సుబ్రహ్మణ్యం, జి.శ్రీను, పలివెల శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

రంగంపేట, ఫిబ్రవరి 23: మండలంలోని జి.దొంతమూరులో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం శ్రీకారం చుట్టారు. గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనం, రజకుల కమ్యూనిటీ హాలును ఆయన ప్రారంభించారు. అలాగే కోటపాడులో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామ నాయకులు ఎమ్మెల్యేను, జడ్పీటీసీ పేపకాయల రాంబాబును సత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇశ్రాయేలు, గవరసాని రాజు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను నిరోధించాలి : మనోహర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 23: సమాజంలో మూఢనమ్మకాల నిరోధానికి మెజీషియన్లు కృషి చేయాలని మెజీషియన్ డాక్టర్ ఎస్.మనోహర్ (స్టిక్ మనోహర్) పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం శ్యామల సెంటర్ ఇంద్రజాల నిలయంలో శుక్రవారం జాతీయ ఇంద్రజాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత మ్యాజిక్ ద్వారా పీసీ సర్కార్ సీనియర్ చిత్రపటాన్ని సృష్టించి పూలమాలలతో నివాళులర్పించారు.అనంతరం యువ మెజీషియన్ శోభిత్ వర్మ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మెజీషిన్లు అందరూ తమతమ ప్రదర్శనలు నిర్వహించారు.